ప్రసూతి సెలవుల్లో వివక్ష తగదు
- రెగ్యులర్, కాంట్రాక్టు ఎవరైనా ఒకటే
- కలకత్తా హైకోర్టు స్పష్టీకరణ

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 205 | విజయవాడ, గురువారం 29 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 29 February 2024 | Rs

ఇషాన్, శ్రేయస్‌పై బిసిసిఐ కొరడా
- వార్షిక కాంట్రాక్ట్‌ల పొడిగింపునకు 'నో'
- యువ క్రికెటర్లకు పెద్దపీట

8



'జెండా' సభకు హాజరైన టిడిపి, జనసేన శ్రేణులు

కలిసి నడుస్తాం

- తాడేపల్లిగూడెం సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్
- పొగడ్తల జోరు...విమర్శల హోరు
- రాష్ట్ర సమస్యల ఊసే లేని ప్రసంగాలు
- టికెట్లు రాని వారికి న్యాయం చేస్తామని హామీ



సభలో అభివాదం చేస్తున్న పవన్ కల్యాణ్, చంద్రబాబు,


తాడేపల్లి గూడెం నుండి ఎం. శివాజి

రాష్ట్రం కోసమే కలిసి నడుస్తున్నట్లు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పారు. సీట్ల పంపకానికి సంబంధించిన అధికారిక ప్రకటన అనంతరం టిడిపి, జనసేన ఉమ్మడిగా మొదటిసారి నిర్వహించిన 'తెలుగు జన విజయకేతనం జెండా సభ' బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగింది. పెద్ద సంఖ్యలో ఉభయపార్టీల కార్యకర్తలు హాజరైన ఈ సభలో వారు మాట్లాడుతూ ప్రజలు కూడా తమతో చేతులు కలపాలని కోరారు. రెండు పార్టీల పొత్తు గురించి పరస్పరం పొగడుకున్న నేతలు రాష్ట్ర ప్రభుత్వంపైనా, వైసిపి పైనా పెద్ద ఎత్తున విమర్శల వర్షం కురిపించారు. అదే సమయంలో రాష్ట్రానికి అత్యంత కీలకమైన పలు సమస్యల గురించి ప్రస్తావించలేదు. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, కడప ఉక్కు సాధన అంశాల జోలికి పోకుండా ఇరువురు నేతలు ప్రసంగించారు. ఒకటి, రెండు అంశాలను నామమాత్రంగా ప్రస్తావించినప్పటికీ జగన్ ప్రభుత్వ వైఫల్యాన్ని విమర్శించేందుకే సరిపెట్టారు తప్ప, రాష్ట్రానికి జరిగిన ఆ అన్యాయాన్ని ఎలా సరిచేస్తారో చెప్పలేదు. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయంలో దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన మతోన్మాదం, మైనార్టీల పరిరక్షణ అంశాలను నామమాత్రంగా కూడా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ప్రసంగంలో ప్రస్తావనకు నోచుకోలేదు. పైపెచ్చు మోడీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ చెప్పారు. తొలుత మాట్లాడిన చంద్రబాబు అగ్నికి వాయువులాగా తనకు పవన్ తోడయ్యాడని చెప్పారు. రెండు పార్టీల పొత్తు సూపర్‌హిట్టని, ఆంధ్రప్రదేశ్ అన్‌స్టాపబుల్‌అని అన్నారు. 'ఒకపార్టీ వెనుక మరొకపార్టీ నడవడం లేదు. రెండు పార్టీలు కలిసి నడుస్తున్నాయి' అని ఆయన అన్నారు. ఐదుకోట్ల మంది ప్రజల భవిష్యత్ కోసం తాము చేతులు కలిపామని చెప్పారు.

ఎన్నికల ముందు ముద్దులు పెట్టిన జగన్ అధికారంలోకి రాగానే పిడిగుద్దులు గుద్దారని అన్నారు. టిడిపి తీసుకొచ్చిందనే పేరుతో విట్, ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలకు రోడ్లు వేయలేదని పేర్కొన్నారు. క్రికెటర్ హనుమ విహారిని కూడా వదల్లేదని అన్నారు. చెల్లి, తల్లిపై కూడా సోషల్ మీడియాలో విమర్శలు చేయించే దుస్థితికి జగన్ వచ్చారని అన్నారు. జగన్‌వైనాట్ 175 అంటున్నారని, తాము వైనాట్ జాబ్ క్యాలెండర్, డిఎస్‌సి అంటున్నామని చెప్పారు. కుప్పానికి నీళ్లంటూ ముఖ్యమంత్రి నాటకం ఆడారని, సినిమా సెట్టింగులతో నీళ్లు వదిలారని, మరుసటిరోజు నీళ్లు లేవని చెప్పారు. జగన్ మిగతా 2లో

రైతులకు భరోసా కల్పనే లక్ష్యం

- ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- ఈ ఏడాది ఐదో విడత రైతుల ఖాతాల్లో జమ



రైతుభరోసా నిధులు విడుదల చేస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది మూడో విడతగా రైతు భరోసా, పిఎం కిసాన్ మొత్తాలను బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఒక్కొక్కరికి రూ.13,500 చొప్పున నాలుగేళ్లు జమచేశామని, ఐదవ ఏడాదియైన ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటికి రెండు విడతలు అందించినట్లు తెలిపారు. మూడో విడతగా రెండువేల రూపాయల చొప్పున రూ.1,078 కోట్లను 53.58 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఐదేళ్లలో ప్రతి రైతుకు రూ.67,500 చొప్పున రూ.34,288 కోట్లు అందించినట్లు తెలిపారు. రైతులకు సాగుభూమి తక్కువగా ఉండటంతో ప్రభుత్వ సాయం లేకపోతే రుణం అందడం కష్టంగా మారుతోందని తెలిపారు. బయట రుణాలు తీసుకున్నా ఎక్కువ వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని వివరించారు. ఈ పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఖరీఫ్‌లో రూ.7,500, పంటకోసే సమయంలో నాలుగువేలు, చేతికొచ్చే సమయానికి రూ.2,000 క్రమం తప్పకుండా ఇస్తున్నామని వివరించారు. అలాగే సున్నావడ్డీ పేరుతో రైతులకు మరోమేలు చేస్తున్నామని చెప్పారు. రుణాలు తీసుకున్న రైతులు సరైన సమయంలో చెల్లిస్తే వారి వడ్డీ తిరిగి ఇచ్చేస్తున్నామని చెప్పారు. ఇలా 10.79 లక్షల మంది రైతులకు రూ.216 కోట్ల వడ్డీని తిరిగి ఇచ్చేశామని తెలిపారు. తమది రైతుకష్టం తెలిసిన ప్రభుత్వమని చెప్పారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ క్రాప్ ద్వారా ఇన్సూరెన్స్ కవరేజీలోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. రైతుల తరుపున బీమా కడుతున్న ప్రభుత్వం ఎపిలోనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎపి అగ్రిమిషన్ వైస్‌ఛైర్మన్ ఎం.వి.ఎస్. నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ఉద్యానవనశాఖ సలహాదారు శివప్రసాదరెడ్డి, సిఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్లు హరికిరణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో నిర్మాణాలు ఆపండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి



విశాఖ జిల్లా, భీమునిపట్నం సముద్ర తీరం సమీపంలో నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్ జెడ్) పరిధిలో నిర్మాణాలు చేపట్టడానికి అధికారుల అనుమతివ్వడాన్ని ఆక్షేపించింది. అక్కడి యంత్ర సామగ్రిని సీజ్ చేయాలంది. పిటిషనరు సమర్పించిన ఫొటోలను పరిశీలించిన తర్వాత అవి అక్రమ నిర్మాణాలేనని చెప్పింది. తమ ఆదేశాల అమలుపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. బీచ్ ప్రాంతంలో నిర్మాణాలను సవాల్ చేస్తూ విశాఖ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ దాఖలు చేసిన పిల్ తరపున సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని చెప్పారు. విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంటు అథారిటీ న్యాయవాది టి సూర్యకిరణ్ కల్పించుకుని వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని కోరారు. అందుకు అనుమతినిచ్చిన హైకోర్టు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

సందేశ్ ఖలీ సిపిఎం నాయకుణ్ణి హింసించిన

పోలీస్ అధికారులను వెంటనే అరెస్టు చేయండి

- బెంగాల్ ప్రభుత్వంపై సీరియస్
- కామ్రేడ్ సర్దార్‌కు బేషరతుగా బెయిలు
- కలకత్తా హైకోర్టు ఆదేశం

2

రాజధాని పేదలకు

పెన్షన్ పెంపు

- ఇక నుంచి నెలకు రూ.ఐదు వేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాజధాని పరిధిలో భూమి లేని నిరుపేదలకు ఇస్తున్న పెన్షన్‌ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. దీని ప్రకారం ఇప్పటి వరకూ రూ.2500 పెన్షన్ తీసుకుంటున్న 17,215 భూమిలేని కుటుంబాలకు మార్చి ఒకటోతేదీ నుంచి రూ.5 వేలు పెన్షన్ వస్తుంది. ఇటీవల ఫిరంగిపురం సభలో పెన్షన్ పెంచుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పెన్షన్ పెంచాలని కోరుతూ 16వ తేదీన సిఆర్‌డిఎ కమిషనరు ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాశారు. దీన్ని వెంటనే ఆమోదిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

పిఎం కిసాన్ సాయానికి భారీ కోత

- 12 లక్షల రైతులపై అనర్హత వేటు
- 40 లక్షలకే ఈ దఫా రూ.2 వేల కిస్తు
- 52 లక్షలంటూ రాష్ట్ర సర్కారు ఊదర
- కేంద్రం తీరుపై నోరు మెదపని వైనం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్ర నిబంధనల కారణంగా రాష్ట్రంలో పిఎం కిసాన్ లబ్ధిదారులకు భారీగా కోత పడింది. బుధవారం ప్రధాని మోడీ మహారాష్ట్ర పర్యటనలో 16వ విడత (ఈ సంవత్సరంలో మూడవ కిస్తు) విడుదల చేయగా, ఎ.పి.లో దాదాపు 12 లక్షల లబ్ధిదారులపై అనర్హత వేటు పడింది. జమ చేశారంటున్న వారికీ సొమ్ము దశలవారీగా రాబోయే పదిహేను రోజుల్లో పడుతుందని చెబుతున్నారు. ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమల్లోకొస్తుందన్న భయంతో లాంఛనంగా ప్రధాని జెండా ఊపారని తెలుస్తోంది. కాగా లక్షల్లో లబ్ధిదారుల తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపట్లేదు. పైగా అసత్య ప్రచారం చేస్తోంది.

పిఎం కిసాన్ కిస్తు దాదాపు 52 లక్షల మందికి జమ చేస్తున్నామని పేర్కొనగా, కేంద్రం 40 లక్షల మందికే ఓకే చేసింది.

ఆంక్షల కొరడా

వైఎస్‌ఆర్ రైతు భరోసా పథకాన్ని కేంద్ర స్కీం పిఎం కిసాన్‌తో కలిపి రాష్ట్ర సర్కారు అమలు చేస్తోంది. సంవత్సరంలో మూడు విడతల్లో రూ.13,500 ఇస్తుండగా, రాష్ట్ర వాటా రూ.7,500, కేంద్రం వాటా రూ.6 వేలు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పుడు మూడవ కిస్తు విడుదల చేశారు. ఈ విడతలో సొంత భూమి కలిగిన రైతులకు కేంద్రం నుంచి రూ.2 వేలు పడతాయి. పిఎం కిసాన్‌కు కేంద్రం ఇ-కెవైసి, ఆధార్ బేస్డ్ పేమెంట్స్ సిస్టం (ఎబిపిఎస్) సీడింగ్.. ఈ రెండు నిబంధనలనూ తప్పనిసరి చేసింది. రైతులు ఈ రెండింటినీ చేయించుకుంటేనే పిఎం కిసాన్ సహాయం జమ అవుతుంది. పలు వడపోతల అనంతరం భూమి రికార్డుల పరిశీలన తర్వాత 40,78,322 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరి భూమి రికార్డులతో ఇ-కెవైసి, ఎబిపిఎస్ సీడింగ్ జరగాలి. వీరిలోనూ ఇంకా వేల సంఖ్యలో సీడింగ్ జరక్క పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర సర్కారు మాత్రం 52 లక్షల మందికి భరోసా- పిఎం కిసాన్ జమ అవుతుందని తెలిపింది. అందుకు ముఖ్యమంత్రి బుధవారం బటన్ నొక్కారని ప్రకటించింది. ఈ విడతలో పడేది కేవలం కేంద్రం ఇచ్చే రూ.2 వేలు మాత్రమే. రాష్ట్రం ఇచ్చేదేమీ లేదు. అయినా సిఎం రూ.వెయ్యి కోట్లకు పైన పంపిణీకి బటన్ నొక్కారని సర్కారు ప్రచారం చేసింది.

లక్షన్నర మందికే

వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ విడతలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీలకు చెందిన కౌలు రైతులకు, అటవీ హక్కుల చట్టం కింద గుర్తింపు పొందిన సాగుదారులు (ఆర్‌ఒఎఫ్‌ఆర్), దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న వారికే. ఈ వర్గాలకు కేంద్రం సహాయం చేయట్లేదు. అందువల్ల రాష్ట్రం తన నిధులతో సహాయం అందిస్తోంది. సదరు లబ్ధిదారులు 1,46,324 మంది మాత్రమే. ప్రభుత్వం జారీ చేసిన సిసిఆర్‌సి హోల్డర్లు లక్ష లోపే. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ.30 కోట్ల లోపు. అది కూడా ఖజానాలో నిధుల లభ్యతబట్టి రోజుకు కొంత మందికి విడుదల చేస్తోంది. ప్రభుత్వ హామీ మేరకు మూడవ కిస్తు రైతుల పండగ సంక్రాంతికి విడుదల చేయాలి. కానీ కేంద్రంతో లింక్ వలన కౌలు రైతులకు తానిచ్చే సహాయానికి ఆలస్యం చేసింది.

మామిడికి మంచు ముప్పు

బంగినపల్లికి తామర పురుగు • ఆందోళనలో రైతులు



ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గత 20 రోజులుగా పొగమంచు మామిడి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. పిందె దశలో తామర పురుగు, బూడిద తెగులు ఆశిస్తోంది. దీంతో, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8.55 లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉమ్మడి చిత్తూరు, కృష్ణా జిల్లాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉండగా, ఉమ్మడి విజయనగరం జిల్లా 1.25 లక్షల ఎకరాల సాగుతో తృతీయ స్థానంలో ఉంది. దేశవ్యాప్తంగా సుపరిచితమైన బంగినపల్లి, నోరూరించే సువర్ణరేఖ, చెరుకు రసాలు, పనుకులు వంటి పలు రకాల మామిడి పండ్లకు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రసిద్ధి. రాష్ట్రంలో అనేక చోట్ల మామిడి సాగు ఉన్నప్పటికీ ఇక్కడి మామిడి పండ్ల రుచి ప్రత్యేకం. ఎంతో మధురంగా ఉంటాయి. అందుకే నేరుగా ఇక్కడి నుంచి కోల్‌కత్తా, ఢిల్లీ, ముంబయి, చెన్నయ్ తదితర మహానగరాలకు రైళ్ల ద్వారా ఎగుమతి అవుతుంటాయి. చాలా వరకు చిన్న, సన్నకారు రైతులు కావడంతో కొంతమంది రైతులు తోటలను లీజుకు లేదా అడ్వాన్స్ చెల్లించి సాగు చేస్తుంటారు. భూసారం, రకాన్ని బట్టి 2.5 టన్నుల నుంచి 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంటుంది. ఈ ఏడాది వాతావరణ ప్రతికూలత వల్ల పూత నిలబడడం లేదు. ముఖ్యంగా పొగమంచు, తెగుళ్ల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. రకాన్ని బట్టి రెండు లేదా మూడుసార్లు పూతకు వస్తాయి. సువర్ణరేఖకు ఇప్పటి వరకు రెండు దఫాలుగా పూత వచ్చింది. మొదటి దశ పూతలో పిందెకట్టు బాగానే ఉంది. గత పదిహేను రోజులుగా రెండో దశ పూతకు వచ్చింది. పొగమంచు వల్ల పిందెకట్టు తక్కువగా కనిపిస్తోందని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని బంగినపల్లి రకం 15 శాతం వరకు పూతకు వచ్చింది. పొగమంచుకు తోడు అడపాదడపా కురిసిన అకాల వర్షాలు, రాత్రి ఉష్ణోగ్రత బాగా తగ్గిపోతుండడంతో తామర పురుగు, బూడిద తెగులు ఆశిస్తోంది. తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. పనుకులు రకం ఇప్పటి వరకు మూడు దశలుగా పూతకు వచ్చింది. ఒకటి, రెండు దశల్లో వచ్చిన పూతలో పిందెకట్టు బాగానే ఉన్నా, మూడో దశలో చాలా తక్కువగా ఉందని ఉద్యాన శాఖాధికారులు, సిబ్బంది విశ్లేషణ. ఈ ఏడాది తాము నష్టపోతామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మామిడి సాగులో రైతులు అప్రమత్తంగా ఉంచాలి. గడిచిన 20 రోజులుగా కురుస్తున్న పొగమంచు, రాత్రి ఉష్ణోగ్రత తగ్గుదల, తెగుళ్ల కారణంగా పూత... పిందె వరకూ రావడం లేదు. తెగుళ్ల ఉధృతి నివారణకు ఒక లీటరు నీటిలో ఇమిడాక్లోప్రిడ్ 0.6 ఎంఎల్, ఫిప్రోనిల్ 2 ఎంఎల్, హెక్సకనోజోల్ 1.5 ఎంఎల్, మిక్లోబుటని 0.5 ఎంఎల్, బోరన్ ఒక గ్రాము పిచికారీ చేయాలి. మరిన్ని వివరాలకు ఉద్యాన శాఖ సిబ్బందిని, ఆర్‌బికె కేంద్రాలను మామిడి రైతులు సంప్రదించాలి.

-ఎవిఎస్‌వి జమదాగ్ని, జిల్లా ఉద్యాన శాఖాధికారి

వైసిపికి ఎంపీ మాగుంట రాజీనామా

- తనయుడు రాఘవరెడ్డి ఎంపీగా పోటీ చేస్తాడని వెల్లడి

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఒంగోలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మగౌరవం చాలా ముఖ్యమని, వైసిపికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. 33 ఏళ్లుగా మాగుంట కుటుంబం గౌరవం కోసమే ఇక్కడ రాజకీయాలు చేసిందని, జిల్లా ప్రజానీకం అన్నివిధాలా తమను ఆదరించిందని వివరించారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల రీత్యా వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు కన్నీటిపర్యంతమవుతూ ప్రకటించారు. భవిష్యత్ ఏమిటనేది మళ్లీ వెల్లడిస్తానని చెప్పారు. తన కుమారుడు రాఘవరెడ్డి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తారని శ్రీనివాసులరెడ్డి ప్రకటించారు.

తిరుపతిలో 'హోదా' డిక్లరేషన్

- వై.ఎస్.షర్మిల
- మార్చి 1న సభ



మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అభివృద్ధి కోసం మార్చి ఒకటోతేదీన తిరుపతిలో జరిగే సభలో ప్రత్యేక హోదా పై డిక్లరేషన్ ప్రకటిస్తామని పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల తెలిపారు. బుధవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారవైసిపి ప్రత్యేక హోదాపై మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఎపిని హార్డ్‌వేర్ హబ్‌గా మారుస్తామన్నారని, చమురు రిఫైనరీలు ఇస్తామని మోడీ చెప్పారని వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని బిజెపి పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు. హోదా ద్వారా రాయితీలు, పరిశ్రమలు వస్తాయని, అది లేకపోవడంతో ఇప్పటి వరకూ కనీసం పది పరిశ్రమలు కూడా రాలేదని అన్నారు. ఉద్యోగాలు దొరక్క యువత పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్నారని, యువతలేని రాష్ట్రంగా ఎపి తయారవుతోందని పేర్కొన్నారు. మెగా డిఎస్‌సి, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను జగన్ మోసం చేశారని అన్నారు. ప్రత్యేక హోదా పేరుతో ఓట్లు దండుకోవడం తప్ప ఎవరూ పోరాటం చేయలేదని అన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రాజధాని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేత లాంటి నిర్ణయాలు అమలు కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని షర్మిల అన్నారు. . సుదీర్ఘ సముద్రతీరం ఉన్నా కనీసం ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. హోదా అవసరం గురించి అందరికీ తెలిసినా వైసిపి, టిడిపి, జనసేన మాట్లాడటం లేదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏదీ అమలు చేయలేదని అన్నారు. మోడీకి బానిసలుగా మారిన జగన్,బాబు, పవన్ ప్రజలను కూడా బిజెపికి బానిసలగా చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదరికం అసమానతలు తొలగిపోవడానికి ప్రతి పేదకుటుంబానికి ఐదువేల రూపాయలను మహిళల ఖాతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. నిత్యావసర ధరల పెరుగుదలతో పేదల జీవనం కష్టమవుతోందని, ఈ సమయంలో ఐదువేల రూపాయలు వారిని ఎంతోకొంత ఆదుకుంటుందని తెలిపారు.

ఐఎఎస్ ఇంతియాజ్ విఆర్ఎస్

- కర్నూలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అడిషనల్ చీఫ్ కమిషనరు ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌గా పనిచేస్తున్న 2009 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ఎఎండి ఇంతియాజ్ బుధవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు అనుమతి కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం కూడా యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తును ఆమోదించింది. ఈ మేరకు ప్రభుత్వం జిఓ ఆర్‌టి నెంబరు 477ను విడుదల చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వైసిపి కర్నూలు శాసనసభ అభ్యర్థిగా పోటీకి బరిలో దింపాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ఇంతియాజ్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం.



సిఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సూర్యారావు

జగన్ సమక్షంలో వైసిపిలోకి సూర్యారావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకులు గొల్లపల్లి సూర్యారావు వైసిపిలో చేరారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో బుధవారం సూర్యారావు వైసిపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పి గన్నవరం నియోజకవర్గానికి చెందిన టిడిపి నేత స్టాలిన్‌బాబు కూడా వైసిపిలో చేరారు. గొల్లపల్లి సూర్యారావు టిడిపి తరఫున 1989లో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2004లో తొలిసారి కాంగ్రెస్ నుంచి గెలిచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కేబినెట్‌లో చిన్న పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం టిడిపిలో చేరి 2014లో రాజోలు నుంచి గెలిచారు. అదే నియోజకర్గం నుంచి 2019లో జనసేన నుంచి పోటీ చేసిన రాపాక వరప్రసాద్ చేతిలో ఓటమి పాలయ్యారు. టిడిపి నుంచి పోటీ చేసేందుకు అవకాశం వస్తుందని ఆశించిన గొల్లపల్లి సూర్యారావుకు ఆ నియోజకవర్గం పొత్తుల్లో భాగంగా జనసేనకు ఇవ్వడంతో ఆయన వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపి మిథున్‌రెడ్డి, విజయవాడ ఎంపి కేశినేని నాని పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయండి

- ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈ మేరకు బుధవారం ఎపిఎస్ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనమయ్యాక 2096 మందికి ఉద్యోగోన్నతులు కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉద్యోగోన్నతుల ఉత్తర్వులు వచ్చాక క్రమశిక్షణ చర్యలు, ఇతర సాంకేతిక కారణాలతో చాలా మంది ఉద్యోగోన్నతులకు దూరంగా వున్నారని వివరించారు. త్వరలో 1,950 మందికి ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు హామీ ఇచ్చారు. అలాగే విద్యార్హతలు లేవని నిలుపుదల చేసిన ఆటోమెటిక్ అడ్వాన్సు ఇంక్రిమెంట్లను కూడా వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు దామోదరరావు తెలిపారు.

కలిసి నడుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసనీయత ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు. కుప్పంలో తాను లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తానని చెప్పారు. పొత్తు కారణంగా అందరికీ సీట్లు ఇవ్వకపోవచ్చని, అయితే పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి న్యాయం చేసే బాధ్యతను ఇద్దరం తీసుకుంటామని చెప్పారు

జగన్ మోసం చేశారు : పవన్ కళ్యాణ్

ఐదేళ్ల పాలనలో జగన్ యువత, రైతులు, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల్లో వైసిపి నేతలు బూతులు తిట్టినా, ఆక్రమణలు చేసినా జెండా కర్రతో మడతపెడతామని హెచ్చరించారు. తన పార్టీకి ఉన్న ఒకేఒక్క ఎమ్మెల్యేను లాక్కున్న జగన్ ఒంటరి ఎలా అవుతారని ప్రశ్నించారు. జగన్ గోబెల్స్ ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. చంద్రబాబు అనుభవం అవసరమనే ఉద్దేశంతో పొత్తు కుదుర్చుకున్నానని చెప్పారు. తనకు, పార్టీకి సలహాలు ఇచ్చేవారు అవసరం లేదని, ఎన్నికల్లో యుద్ధం చేసేందుకు యువకులు కావాలని అన్నారు. అన్ని అర్థం చేసుకునే తాము 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లలో పోటీచేస్తున్నామని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో మహాయుద్ధానికి శంఖారావం పూరిస్తున్నామని ప్రకటించారు.. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, నాయకులు బాలకృష్ణ, నిమ్మల రామానాయుడు, ఎంఎషరీఫ్, జనసేన నాయకులు కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, ఎంపి రఘురామకృష్ణంరాజు తదితరులు ప్రసంగించారు.

వైసిపిలో ఏం జరుగుతోంది!

- ఆరుగురు ఎంపిలు, పది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు దూరం
- అదే దారిలో మరికొందరు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2019 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు 151 స్థానాల్లో గెలుపొంది ఆ తర్వాత జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వీప్ చేసిన అధికార వైసిపికి 2024 ఎన్నికలకు ముందు కీలకనేతలు పార్టీని వీడుతుండటం చర్చనీయాంశమైంది. ఇప్పటికే ఆ పార్టీని ఆరుగురు ఎంపిలు, పది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు వీడగా, మరికొందరు పార్టీకి దూరం అయ్యేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి వైసిపికి బుధవారం రాజీనామా చేశారు. టిడిపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయన వెంట ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. నెల్లూరు ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మైలవరం అసెంబ్లీకి వసంత కృష్ణప్రసాద్‌కు టికెట్లు ఖరారు చేసినా వారు టిడిపి నుంచి పోటీ చేసేందుకు లైన్ క్లియర్ చేసుకున్నారు. నర్సరావుపేట సిట్టింగ్ ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలుకు పోటీ చేసేందుకు అవకాశం ఇస్తామన్నా వైసిపికి నో చెప్పి టిడిపిలో బెర్తు ఖరారు చేసుకున్నారు. జగన్ కేబినెట్‌లో రెండోసారి అవకాశం దక్కిన కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు కర్నూలు పార్లమెంటు టికెట్ ఖరారు చేసినా పోటీ చేసేందుకు ససేమిరా అంటూ టిడిపి అభ్యర్థిగా గుంతకల్ అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారు. పెనుమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి వైసిపిని వీడకుండా పలువురు చర్చించినా ఆయన టిడిపిలోకి వెళ్లిపోయారు. అలాగే కందుకూరు నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహిధర్‌రెడ్డి పోటీకి విముఖత చూపడంతో తమిళనాడుకు చెందిన కఠారి అరవిందా యాదవ్‌కు టికెట్ ఖరారు చేశారు. అయితే ఆ తర్వాత కఠారి అరవిందా యాదవ్ పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేయడంతో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన యాదవ్ పేరును బుధవారం విడుదల చేసిన 8వ జాబితాలో ప్రకటించారు. ఇలా చాలా నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు పక్క పార్టీల్లో అవకాశం చూస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ మార్పులు చేర్పులు

- ఐదు పేర్లతో వైసిపి ఎనిమిదో జాబితా
- గుంటూరు ఎంపి అభ్యర్థిగా కిలారు రోశయ్య
- ఒంగోలుకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- మూడోసారి మారిన జిడి నెల్లూరు అసెంబ్లీ అభ్యర్థి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి అధికార వైసిపి మార్పులు చేర్పులతో ఎనిమిదో జాబితాను బుధవారం విడుదల చేసింది. గుంటూరు పార్లమెంటుకు మొదట ఉమ్మారెడ్డి రమణ పేరును ప్రకటించిన వైసిపి ఇప్పుడు పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్యను ప్రకటించింది. అలాగే ఒంగోలు పార్లమెంటు స్థానానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును ప్రకటించింది. ఇప్పటికే రెండు పర్యాయాలు మార్చిన గంగాధర నెల్లూరు అసెంబ్లీకి ముచ్చటగా మూడోసారి అభ్యర్థిని మార్చింది. ప్రస్తుతం జిడి నెల్లూరు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి స్థానంలో చిత్తూరు ఎంపి రెడ్డప్ప పేరును ప్రకటించారు. కె నారాయణస్వామి ఎంపిగా పోటీ చేయలేనని గట్టిగా పట్టుబట్టడంతో మళ్లీ నారాయణస్వామి పేరును ప్రకటించిన వైసిపి అధిష్టానం ఎనిమిదో జాబితాలో కొత్తగా కల్లత్తూరు కృపాలక్ష్మి పేరును ప్రకటించింది. గతంలో మానుగుంట మహిధర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కందుకూరు అసెంబ్లీకి మొదట కఠారి అరవిందా యాదవ్ పేరును ప్రకటించగా, ఇప్పుడు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావును ప్రకటించింది. పొన్నూరు అసెంబ్లీ స్థానాన్ని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోదరుడు, కాంట్రాక్టరు అయిన అంబటి మురళికి కేటాయించింది.

నియోజకవర్గం	పార్టీ సమన్వయకర్త
గుంటూరు పార్లమెంట్	కిలారు రోశయ్య
ఒంగోలు పార్లమెంట్	చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
పొన్నూరు అసెంబ్లీ	అంబటి మురళి
కందుకూరు	బుర్రా మధుసూదన్ యాదవ్
జిడి నెల్లూరు	కల్లత్తూర్ కృపాలక్ష్మి

ఉక్కు కోసం 3న మహాపాదయాత్ర

- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా పోరాటం : నర్సింగరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం మార్చి మూడున ఉదయం ఆరు గంటలకు నగరంలోని కూర్మన్నపాలెం దీక్షా శిబిరం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తెలిపారు. ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు. ఈ పాదయాత్ర విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు తెలిపారు. జగదాంబ జంక్షన్‌లోని ఎన్‌పిఆర్ భవన్‌లో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ ప్రజల మద్దతుతో మూడేళ్లుగా పోరాడుతున్నామన్నారు. దేశంలో బిలాయ్, బొకారో కర్మాగారాల్లో కేంద్రం 35 శాతం వాటాను ప్రయివేటీకరించిందని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మూడేళ్లుగా ప్రజలు, కార్మికవర్గ పోరాటం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కార్మికులను అభినందించారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడం, బ్లాస్ట్ ఫర్నేస్ -3ని మూసివేయడం వంటివి ఆర్థికంగా నష్టపరిచాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం యూనియన్ పెట్టుకున్నారన్న అక్కసుతో విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (మిమ్స్) ఆస్పత్రిలో పనిచేస్తున్న 350 మంది కార్మికులకు యాజమాన్యం బయటకు గెంటేసిందన్నారు. ఈ నెల 29న మిమ్స్ కార్మికులు చేసే పోరాటానికి రాష్ట్ర కార్మికవర్గం సంఘీభావం తెలపాలని కోరారు.

చెరుకు టన్ను మద్దతు ధర రూ.5 వేలు ప్రకటించాలి

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చెరుకు టన్ను ధర రూ.5 వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం సలహాధర పునరుద్ధరించాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంజాబ్, యుపి, మహారాష్ట్రలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సలహాధర ప్రకటిస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా ఉన్న సమయంలో సలహాధరను రద్దు చేశారని, వెంటనే సలహాధరను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మూతపడిన సహకార చక్కెర పరిశ్రమలను తెరిపించాలని కోరారు. చెరుకు సాగులో పెద్దయెత్తున కౌలుదారులు రక్షణ కోసం బ్యాంకులతో ఫ్యాక్టరీలు ఎంఒయులు చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, తద్వారా కౌలు రైతులకు రుణాలు, సబ్సిడీలు అందించాలని పేర్కొన్నారు.

వికసిత్ ఆంధ్ర కోసం రాష్ట్ర స్థాయి ప్రణాళిక

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర స్థాయిలో వికసిత్ ఆంధ్ర విజన్ డాక్యుమెంటును రూపొందించినట్లు పభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి చెప్పారు. సచివాలయంలో బుధవారం ఆయోగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడిన సిఎస్ నీతి అయోగన్ ఆధ్వర్యంలోనే రూపొందించిన వికసిత్ ఆంధ్ర ముసాయిదా డాక్యుమెంటు అద్భుతంగా ఉందని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆ సమయానికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న జాతీయ స్థాయి లక్ష్యాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి డాక్యుమెంటును రూపొందించినట్లు చెప్పారు. పరిశ్రమలు, ఇంధన, వ్యవసాయం, మౌళిక సదుపాయాలు, సేవలు, గ్రీన్ ఎకానమీ నగరాల అభివృద్ధి వంటి అంశాల్లో రాష్ట్రాన్ని అన్ని విధాల మెరుగైన రీతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్రం ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ, ప్రాధమిక రంగం అభివృద్ధి, రేవులు,ఆధారిత అభివృద్ధి వంటి రంగాల్లో దేశంలో అగ్రగామిగా ఉందన్నారు. ఇటీవల కాలంలో నూతన ఓడరేవులను అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటక పరంగా రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకంటున్నట్లు తెలిపారు. రాష్ట్రం మీదుగా విశాఖ-చెన్నై, చెన్నై- బెంగుళూరు, బెంగుళూరు - హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్లు వెళుతుండడంతో పారిశ్రామి కంగా రాష్ట్రాన్ని అన్ని విధాలుగా మరింత అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. తీర ప్రాంతంలో ఓడరేవులు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలతో మెరుగైన రీతిలో కనెక్టవిటీని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రాధ వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధికి కల అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా దేశంలోనే రెండవ పెద్ద సముద్ర తీరం కలిగిన రాష్ట్రంలో తీర ప్రాంత మౌళిక సదుపాయాల అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీనియర్ సలహాదారు ప్రభాకర్‌సాహు, మరో సలహాదారు పార్థసారది ; రెడ్డి, రాష్ట్ర ఇంధన, వ్యవసాయ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె. విజయానంద్, గోపాలకృష్ణ ద్వివేది, ఆయా శాఖ ముఖ్య కార్యదర్శులు ప్రవీణ్ ప్రకాష్, సురేష్‌కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ప్రణాళికాశాఖ కార్యదర్శి గిరిజా శంకర్, ఉద్యానవనశాఖ కమిషనరు శ్రీధర్, వ్యవసాయశాఖ కమిషనరు హరికిరణ్‌తో ఆటు పలు శాఖల కమిషనర్లుపాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసి ఇడి కృష్ణమోహన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎపిఎస్‌ఆర్‌టిసి ఇంజినీరింగ్ విభాగంలో సేవలు అందించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు పి కృష్ణమోహన్‌ను ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ఘనంగా సన్మానించారు. గురువారం రిటైర్మెంటు కాబోతున్న కృష్ణమోహన్‌కు బుధవారం ఆర్‌టిసి హౌస్‌లో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి అన్ని జిల్లాల ప్రజా రవాణా అధికారులు హాజరయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన కృష్ణమోహన్ కాకినాడ జెఎన్‌టియులో మెకానికల్ ఇంజినీరింగ్‌లో బిటెక్ పూర్తి చేశారు. 1988లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీరుగా ఎపిఎస్‌ఆర్‌టిసిలో తన ప్రస్థానం ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో పలు డిపోల్లో మేనేజరుగా, సిటిఎంగా, రీజనల్ మేనేజర్‌గా పనిచేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. కృష్ణమోహన్ ఆర్‌టిసికి 36 ఏళ్లపాటు అత్యున్నత సేవలు అందించారని తెలిపారు. ఏ స్థాయిలో పనిచేసినా పనిపట్ల నిబద్ధతతో సంస్థ పురోభివృద్ధికి కృషి చేసేవారని తెలిపారు. అలాగే రిటైర్మెంటు కాబోతున్న కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్‌విఎస్ నాగేశ్వరరావునూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, కోటేశ్వరరావు, ఎఫ్ఎ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సభ సైడ్‌లైట్స్

- ఆలస్యంగా ప్రారంభమైన సభ : తెలుగు విజయకేతనం జెండా సభ అనుకున్న సమయం కంటే ఆలస్యంగా ప్రారంభమైంది. సాయంత్రం మూడుగంటలకు ప్రారంభమవుతుందని చెప్పినా ఐదుగంటలకు మొదలైంది. నాలుగు గంటల తరువాత మాత్రమే కార్యకర్తలు ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. తొలుత చంద్రబాబు రాగా, అనంతరం పవన్‌కల్యాణ్ వచ్చారు. ఇద్దరూ వేదికపై కార్యకర్తలకు అభివాదం చేశారు. చంద్రబాబు జనసేన జెండా, పవన్ కల్యాణ్ టిడిపి జెండా పట్టుకుని కార్యకర్తలకు అభివాదం చేశారు.
- నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు తానే మళ్లీ ఎంపీగా పోటీ చేస్తానని సభలో ప్రకటించినప్పుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఏదో మాట్లాడుకోవడం కనిపించింది.
- నందమూరి బాలకృష్ణ ప్రసంగం స్పష్టంగా లేకపోవడంతో తీవ్ర చర్చనీయాంశమైంది.
- పెద్ద ఎత్తున తోపులాట జరిగి బారికేడ్లు పడగొట్టి స్టేజీ ఎదురుగా యువత చేరుకోవడంతో కొంతసేపు గొందరగోళం నెలకొంది. దీంతో, క్రమశిక్షణతో ఉండాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు కోరారు.
- సభ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో జనం ముందుగానే తిరుగుముఖం పట్టారు.
- పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో తాడేపల్లిగూడెం బైపాస్‌పై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.
- నాలుగు గంటల వరకు ఎండ కారణంగా జనం రాకపోవడంతో టిడిపి, జనసేన నాయకుల్లో కొంత ఆందోళన నెలకొంది. తర్వాత జనం రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.
- కేరళలో సిపిఎం దాదాపు 30 సంవత్సరాల నుంచి గెలుస్తోంది. ఒడిశాలో నవీన్ పట్నాయక్ గెలుస్తున్నారు. సుస్థిర ప్రభుత్వాలు గెలిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అదే విధంగా మన రాష్ట్రంలోని ప్రజానీకమూ ఆలోచించాలని శాసనమండలి మాజీ చైర్మన్ ఎం.ఎ.షరీఫ్ కోరారు.
- స్టేజీపై దాదాపు 500 మంది అతిథులు కూర్చునేలా ఏర్పాటు చేయడంతో ముఖ్య నేతలతోపాటు అభ్యర్థులూ వేదికపై ఆశీనులయ్యారు.

సందేశ్ ఖలీ సిపిఐ(ఎం) నాయకుణ్ణి హింసించిన

ఆ పోలీస్ అధికారులను వెంటనే అరెస్టు చేయండి

- బెంగాల్ ప్రభుత్వంపై సీరియస్
- కామ్రేడ్ సర్దార్‌కు బేషరతుగా బెయిలు
- కలకత్తా హైకోర్టు ఆదేశం
- తీర్పు పట్ల సిపిఐ(ఎం) నేత సలీం హర్షం

కొల్‌కతా: సందేశ్‌ఖలీ నియోజకవర్గానికి చెందిన సిపిఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే నిరపడా సర్దార్‌కు కలకత్తా హైకోర్టు మంగళవారం బెయిలు మంజూరు చేసింది. ఉత్తర పరగణాల జిల్లా లోని సందేశ్‌ఖలిలో అల్లర్లకు కారణమయ్యారని ఆరోపిస్తూ ఈ నెల 11న సర్దార్‌పై బెంగాల్‌లోని తృణమూల్ ప్రభుత్వం అక్రమ కేసు బనాయించింది. గ్యాంగ్ రేప్ కేసులో ప్రస్తుతం కస్టడీలో ఉన్న తృణమూల్ నాయకుడు భాను మండల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిపిఐ(ఎం) నాయకునిపై కేసు పెట్టారు. ఈ కేసును విచారించిన హైకోర్టు సిపిఐ(ఎం) నాయకుణ్ణి అమానుషంగా కొట్టడం, హింసించడం వంటివి చేయడం చాలా సిగ్గు చేటు అని వ్యాఖ్యానించింది. 17 రోజులుగా ఆయనను హింసించిన పోలీస్ అధికారులను వెంటనే అరెస్టు చేయాలని కోర్టు ఆదేశించింది. సర్దార్‌పై ఫిర్యాదు ఫిబ్రవరి 10న రాగా, అంతకు ముందే పోలీసులు ఎఫ్ఐఆర్‌ను ఎలా పెట్టారని కోర్టు ప్రశ్నించింది. సందేశ్‌ఖలీ ప్రజల హక్కుల కోసం సాహసోపేతంగా పోరాడిన కామ్రేడ్ సర్దార్‌కు మేము విప్లవాభినందనలు తెలియజేస్తున్నామని న్యాయమూర్తులు తెలిపారు. సిపిఐ (ఎం) మాజీ ఎమ్మెల్యేపై తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేసిన రాష్ట్ర పోలీసులను, టిఎంసి నాయకత్వాన్ని కోర్టు తీవ్రంగా మందలించింది.కామ్రేడ్ సర్దార్‌కు బేషరతుగా బెయిలు మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.



సర్దార్‌కు బెయిల్ మంజూరు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సీపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం స్వాగతించారు. హైకోర్టు తీర్పు అనంతరం సలీం మాట్లాడుతూ, సర్దార్‌పై తప్పుడు కేసు పెట్టి అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదు చేయకముందే సర్దార్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు, పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టు తీవ్ర విమర్శలు చేసింది. ఈ పోలీసు అధికారులందరినీ ఎందుకు అరెస్టు చేయరు అని జస్టిస్ ప్రశ్న లేవనెత్తారు. దీనికి తృణమూల్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తణమూల్ నేతలకు, మంత్రుల కు, దొంగలకు, దొంగలకు పోలీసులు కాపలా కాస్తూ పడవ, లాంచీల్లో తీసుకెళుతున్నారు, మరో వైపు ప్రజల హక్కులను కాపాడడం కోసం ఆందోళనలు, నిరసనలు చేస్తున్న వారిని అరెస్టు చేసిజైలులో పెడుతున్నారని సలీం విమర్శించారు.

గ్రావెల్ తవ్వకాలపై నివేదిక ఇవ్వండి

- గనులశాఖకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వీరనాయకునిపాలెం గ్రామ పరిధిలోని 60 ఎకరాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాల నిగ్గు తేల్చేందుకు ఒక సర్వే టీమ్‌ను పంపాలని గనులశాఖకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. గ్రావెల్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై నివేదిక అందజేయాలంది. రిపోర్టులో అవాస్తవాలుంటే న్యాయాధికారిని పంపి వాస్తవాలను నిగ్గు తేల్చుతామని హెచ్చరించింది. గనులశాఖ కార్యదర్శిని కూడా కోర్టుకు పిలిపించాల్సి వస్తుందని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. సదరు గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారంటూ వీరనాయకునిపాలెంకు చెందిన ఎం ప్రభుదాస్ వేసిన పిల్‌పై విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పిటిషనరు తరఫున నర్రా శ్రీనివాసరావు వాదిస్తూ.. అసైన్డ్ ల్యాండ్‌లో తవ్వకాలకు అనుమతివ్వడానికి వీల్లేదన్నారు. 2.86 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తీసుకుని 60 ఎకరాల్లో తవ్వకాలు చేపడుతున్నారని వివరించారు. పిటిషనరు బాధితుడు కాదని ప్రభుత్వం తరఫున న్యాయవాది నవీన్ అన్నారు. రెండు వారాల్లో నివేదిక అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. మరింత గడువు కావాలని ప్రభుత్వం కోరడంతో 'మీరు వేరే గ్రహంపై లేరు' అని వ్యాఖ్యానించింది.

'బ్రీత్ ఎనలైజర్ల' పిల్‌లో తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికలప్పుడు పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్లను ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులివ్వాలంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. జనవాహని పార్టీ దాఖలు చేసిన పిల్‌పై బుధవారం వాదప్రతివాదనలు పూర్తయ్యాయి. తీర్పును వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది.

'రిషికొండ'పై గడువు కోరిన కేంద్రం

ప్రజాశక్తి-అమరావతి

విశాఖలోని రుషికొండపై ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) చేపట్టిన నిర్మాణాల చట్టబద్ధతపై నివేదిక ఇచ్చేందుకు గడువు కావాలని కేంద్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది. నిర్మాణాలు నిబంధనల ఉల్లంఘనపై పరిశీలన, నివేదికకు హైకోర్టు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ 2 వారాల సమయం కోరింది. కేంద్ర వినతిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం అనుమతినిచ్చింది.

ఎస్‌వి వర్సిటీలో రోడ్డు నిర్మాణంపై స్టే

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రోడ్డు నిర్మాణం చేయరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. తిరుమల వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం వర్సిటీ భూమిలో రోడ్డును నిర్మించేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ చేసిన ప్రతిపాదనను సవాల్ చేస్తూ ఆర్ అభిషేక్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు విచారణ జరిపింది. రోడ్డు నిర్మాణం కోసం భారీ వృక్షాలను కూల్చేస్తున్నారని పిటిషనరు పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి విసి అభ్యంతరం చెప్పలేదని తెలుసుకున్న హైకోర్టు భయపడాల్సిన అవసరం లేదని విసిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. అంగీకారం చెప్పే ముందు వర్సిటీ ప్రయోజనాలు, విద్యార్థుల సమస్యలను గమనంలోకి తీసుకోవాలని హితవు పలికింది. తిరుమలకు వెళ్లే వారి కోసం వర్సిటీలోంచి రోడ్డు వేయడం సరికాదంది. స్టే జారీ తర్వాత విచారణను వాయిదా వేసింది.

టెట్, టిఆర్‌టి పరీక్షలపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఎపి ఉపాధ్యాయ భర్తీ పరీక్ష (టిఆర్‌టి), ఎపి టీచర్ అర్హత పరీక్ష (టెట్)ల మధ్య తగిన వ్యవధి ఉండేలా ఉత్తర్వులు జారీ చేయాలనే పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదప్రతివాదనలు బుధవారం ముగిశాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ ప్రకటించారు.

విశాఖ స్టీల్‌కు రూ.8 వేల కోట్లు సమకూర్చుతా : కెఎ పాల్

ప్రజాశక్తి-అమరావతి

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని వేలం వేయబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఒక్క నెల రోజుల్లో రూ.8 వేల కోట్లను జమ చేస్తామని హైకోర్టుకు ప్రజాశాంతి పార్టీ అధినేత కెఎ పాల్ తెలిపారు భూముల విక్రయంపై స్టే ఇస్తే.. కేంద్రం కూడా వేలం వేయబోమని భరోసా ఇస్తే బిలీనియర్లను తన స్నేహితులతోపాటు తన వంతు కింద నెలరోజుల్లో రూ.8 వేల కోట్లను జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్టు కింద ప్రత్యేక ఖాతా ఏర్పాటుకు కేంద్ర సర్కారు అనుమతినిస్తే అందులో రూ.8 వేల కోట్లను జమ చేయిస్తామన్నారు. విశాఖ స్టీల్స్ భూముల వేలాన్ని నిలుపుదల చేయాలంటూ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ గుహనాథన్ నరేందర్, న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. ఇదే అంశంపై దాఖలైన ఇతర పిల్స్‌తో కలిపి దీనిని విచారిస్తామని, ఈ పిల్‌ను కూడా వాటితో జత చేసేందుకు సిజె నుంచి అడ్మినిస్ట్రేటివ్ పర్మిషన్స్ తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

కబ్జా నుంచి చెరువు రక్షణకు పిల్

ప్రజాశక్తి-అమరావతి

శ్రీకాకుళం జిల్లా సింగూపురం గ్రామంలోని చెరువును పూడ్చేస్తున్నారనే పిల్‌ను విచారించిన హైకోర్టు స్పందించింది. చెరువు రక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరును ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. సింగూపురం సర్పంచ్ ఆదిత్య నాయుడు చెరువును కబ్జా చేసి పూడ్చేస్తున్నారంటూ ఆ ప్రాంత ఎంపిటిసి బగ్గు అప్పారావు సహా ఆరుగురు పిల్ దాఖలు చేశారు. పిటిషనరు తరఫున న్యాయవాది విద్యావతి అందజేసిన శాటిలైట్ చిత్రాలను బెంచ్ పరిశీలించింది. అక్కడ పెద్దయెత్తున కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్పష్టం అవుతోందని వ్యాఖ్యానించింది.

పట్టాలివ్వొద్దని పిల్ ఎలా వేస్తారు?

ప్రజాశక్తి-అమరావతి

ఒంగోలు మున్సిపాల్టీలో టిడ్కో ఇళ్లు ఖాళీ, ఇళ్ల జాగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పి ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వొద్దంటే ఎలాగని హైకోర్టు నిలదీసింది. పట్టాలు ఇవ్వొద్దని ఎలా కోరతారని పిటిషనరును ప్రశ్నించింది. ఇప్పటికే పట్టాలు పొంది తిరిగి మళ్లీ పట్టాలు పొందుతున్న వారుంటే వారి జాబితా ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించింది. పిల్ దాఖలు చేసి ఊరుకుంటే కాదని, అన్ని వివరాలూ పిల్ దాఖలు చేసిన వారే కోర్టుకు నివేదించాలంది. విచారణను వారం రోజులకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. నవరత్నాలు పథకం అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒంగోలులో పేదలందరికీ ఇళ్ల పట్టాల పథకం కింద 22,620 మందికి పట్టాలు ఇచ్చేందుకు వీలుగా రూ.210 కోట్లు విడుదల చేసింది. దీనిని రద్దు చేయాలంటూ టిడిపికి సింగరాజు రాంబాబు పిల్ దాఖలు చేశారు. మున్సిపల్ పరిధిలో ఏడు వేల టిడ్కో ఇళ్లు, పలు స్థలాలు ఖాళీగా ఉన్నప్పటికీ అంత భారీ మొత్తంతో పట్టాలు ఇస్తున్నారని చెప్పారు. గతంలో పట్టాలు తీసుకున్న వారికే మళ్లీ పట్టాలు ఇస్తున్నారని, సామాజిక ఆర్థిక సర్వే చేయలేదని పేర్కొన్నారు.

సిఎఎ విరమించుకోవాలి : కె రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను అమలు చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపన్నుతోందని, ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసే సిఎఎ అమలు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిజెపి మతరూపం మరోమారు విజృంభిస్తోందన్నారు. తీవ్ర నిరసనల మధ్య వాయిదా పడిన సిఎఎ చట్టాన్ని మార్చి నెల నుంచి అమలు చేసేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రజాతంత్ర వాదులందరూ మోడీ ప్రభుత్వ దుందుడుకు చర్యలను ఖండించాలని కోరారు.

గిట్టుబాటు ధరపైనే ఆశలు

నేటి నుంచి పొగాకు కొనుగోలు

తుపాను వల్ల పెట్టుబడి రెట్టింపు


ప్రకాశం జిల్లా కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రైతు సుబ్బారావు అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పొగాకు బేళ్లు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో గురువారం నుంచి పొగాకు కొనుగోలు ప్రారంభం కానుంది. మూడు దశల్లో మొదలయ్యే వేలం మొదటగా ప్రకాశం జిల్లా ఒంగోలు, కొండపి కేంద్రాల్లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే బోర్డు అధికారులు సమాచారం ఇవ్వడంతో రైతులు బేళ్లను సిద్ధం చేశారు. ఈ ఏడాది నవంబరులో వచ్చిన తుపానుకు పొగాకు తోటలు నిలువునా మునిగాయి. సుమారు 50 వేల ఎకరాల్లో పంట పోయింది. అప్పటికే ఎకరాకు రూ.50 వేలకు పైగానే పెట్టుబడి పెట్టారు. రూ.కోట్లలో నష్టం జరిగింది. బోర్డుగానీ, కేంద్రంగానీ ఆదుకోలేదు. తుపానుకు దెబ్బతిన్న తోటలన్నీ పీకేసి మళ్లీ నాట్లు వేశారు. దీంతో, పెట్టుబడులు రెట్టింపయ్యాయి. అష్టకష్టాలు పడి పొగాకు పండించారు. ధర క్వింటాలుకు రూ.25 వేలకు పైగా లేకపోతే నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర అందించాల్సిన బాధ్యత పొగాకు బోర్డుపై ఉంది.

బ్యారన్‌కు రూ.10 లక్షలు పెట్టుబడి!

రాష్ట్రంలో సుమారు 22 వేల బ్యారన్‌లు ఉన్నాయి. 142 మిలియన్ కిలోలకు పంటను అనుమతించారు. ఈ ఏడాది ఈ స్థాయిలో పంట దిగుబడి ఉందా? అనేది అనుమానమే. ఎందుకంటే ముందుగా వేసిన తోటలు దెబ్బతిన్నాయి. వాటిని పీకేసి మళ్లీ నాట్లు వేశారు. దీంతో, జాప్యం జరిగింది. తోటలు సజావుగా లేవు. పైగా సాగునీరు లేనందున కూడా ఖర్చు భారీగా పెరిగింది. బ్యారన్‌కు ప్రకాశం జిల్లాలో పెట్టుబడి రూ.10 లక్షల వరకూ ప్రాంతాలను బట్టి అయింది. నీటి కోసం ఎకరాకు ఒకసారి తడి కోసం రూ.12 వేల నుంచి రూ.14 వేలు ఖర్చు పెట్టారు. ట్యాంకర్లతో నీటిని రప్పించి మొక్కలు వేశారు.

తర్వాత ఇంజన్లు పెట్టి ఎక్కడ నీరుంటే అక్కడ నుంచి పైపులు వేసి తోటలు తడిపారు. ఆరుతడులను కూడా ఇంజన్లు, మోటార్లు ఉన్న సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చారు. వాళ్లే ఎక్కడ నీళ్లుంటే అక్కడ నుంచి పైపుల ద్వారా తరలించి తోటలు తడిపారు.

గతేడాది గరిష్ట ధర కన్నా పెరిగితేనే ఊరట

గతేడాది వేలం ఆఖరులో వ్యాపారులు పోటీ పడ్డారు. గరిష్ట ధర కిలోకు రూ.289 లభించింది. కనిష్ట ధర రూ.150 ఇచ్చారు. దీంతో, వేలం ముగిశాక రైతులకు సగటు ధర రూ.225.73 దక్కింది. 181.02 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరిగాయి. 2022లో 120.99 మిలియన్ కిలోల పంట కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.245 ఇవ్వగా, కనిష్ట ధర రూ.50కి మించలేదు. ఆ ఏడాది సగటు ధర రూ.179.17 ఉంది. గతేడాది ఇచ్చిన గరిష్ట ధర కన్నా ఎక్కువగా ఇస్తేనే రైతులకు ఊరట కలుగుతుంది. లేకుంటే నష్టాలపాలవుతారని అంచనా.

గిట్టుబాటు ధర కల్పనకు చర్యలు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. బోర్డు సమావేశంలో వ్యాపారులకూ ఇదే విషయాన్ని చెప్పాం. రైతులు నష్టపోకుండా ధర ఇవ్వాలని కోరాం.

-గుత్తా వాసుబాబు, పొగాకు బోర్డు వైస్‌చైర్మన్

ఎకరాకు రూ.1.50 లక్షలు ఖర్చు



నేను 18 ఎకరాల్లో పొగాకు వేశాను. ఎకరా ఒక్కంటికే ఇప్పటివరకు అన్నీ ఖర్చులు కలిపి సుమారు రూ.1.50 లక్షలు అయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే సాగు ఖర్చులు పెరిగాయి. బ్రైట్ రకం పొగాకుకు కిలోకు రూ.300 ధర ఇస్తేనే రైతులు అప్పుల్లో కూరుకుపోకుండా ఉంటారు.

-బెజవాడ వెంకట సుబ్బారావు, పొగాకు రైతు, కట్టావారిపాలెం

ధర రూ.30 వేలు ఇవ్వాలి

ఈ ఏడాది రెండుసార్లు పొగాకు సాగు చేయాల్సి వచ్చింది. తుపాను వల్ల పెట్టుబడి రెట్టింపు అయింది. క్వింటాలుకు రూ.30 వేలు ధర ఇస్తేనే ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులు బయటపడతారు. నీళ్ల ఖర్చే ఎకరాకు ఒక తడికి లక్ష రూపాయలకుపైగా అయింది.

-పమిడి వెంకట్రావు, రైతు సంఘం నేత


తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

తొలగించిన చోటే స్థలాలివ్వండి

- కలెక్టరేట్ ఎదుట పేదల ధర్నా


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరం కరకంబాడీ వద్ద ఎర్రగుట్టపై గుడిసెలను తొలగించిన చోటే స్థలాలివ్వాలని జిల్లా కలెక్టరేట్ ఎదుట పేదలు ధర్నా చేశారు. ఎర్రని ఎండను సైతం లెక్క చేయకుండా వందలాది మంది రోడ్డుపై బైఠాయించారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో స్థలాలు చూపించాలని నినాదాలు చేశారు. స్థలాలు చూపేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య మాట్లాడారు. ఏమి నేరం చేశారని పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేశారని, పేదల పక్షాన పోరాడుతున్న సిపిఎం నేతలను ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. భూ కబ్జాదారుడైన సిద్ధులు రవిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.. కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని కోరారు. అనంతరం డిఆర్ఒ పెంచల కిషోర్‌కి వినతిపత్రం అందజేశారు. డిఆర్ఒ మాట్లాడుతూ.. 15 రోజుల్లో పేదలకు స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పేదలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, మాధవ్, జయచంద్ర, వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తాం

- జై భారత్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ
- పార్టీ మ్యానిఫెస్టో విడుదల
- విశాఖ నుంచి పోటీ చేస్తానని వెల్లడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించడంలో వైసిపి, టిడిపి విఫలమయ్యాయని జై భారత్ పార్టీ జాతీయ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రత్యేక హోదా సాధనకు కృషి చేస్తామని, దీనిపై జై భారత్ పార్టీకి స్పష్టత, ఉద్యమ కార్యాచరణ ఉందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మేనిఫెస్టోను ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తోందని విమర్శించారు. మార్చి ఒకటిన విద్యార్థి, పోరాట సంఘాలు తలపెట్టిన చలో తాడేపల్లి కార్యక్రమానికి మద్దతునిస్తున్నట్టు తెలిపారు. 22 మంది ఎంపిలను గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని చెప్పిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లోగా తాను సాధించిందేమిటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పోరాడితే సత్ఫలితాలు వస్తాయని, అందుకు నిర్దిష్ట కార్యాచరణ అవసరమని తాము భావిస్తున్నానని తెలిపారు. చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ నుంచి తాను పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు.


నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముఖ్యమంత్రి జగన్

వైసిపి నేత కుమారుడి వివాహానికి హాజరైన సిఎం

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పర్యటించారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరిగిన వైసిపి పాలకొల్లు నియోజకవర్గ నేత గుణ్ణం నరసింహ నాగేంద్రరావు (నాగబాబు) కుమారుడు సుభాష్ వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులు సురేష్, విజయ దీప్తిలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మాచర్లలో మరోసారి ఉద్రిక్తత

- వైసిపి, టిడిపి పరస్పర దాడులు
- పలువురికి గాయాలు


ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో సమస్యాత్మకమైన మాచర్ల నియోజకవర్గంలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్య మరోసారి ఘర్షణ తలెత్తింది. నియోజకవర్గ కేంద్రమైన మాచర్ల పట్టణంలోని షాదీఖానా సమీపంలో టిడిపి శ్రేణులు కొద్దిరోజులుగా 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ప్రచారం చేస్తున్నాయి. అందులో భాగంగా బుధవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా వైసిపి శ్రేణులు కూడా తమ కార్యక్రమం ఉందంటూ ఫ్లెక్సీలు ఏర్పాటుకు ఉపక్రమించాయి. దీంతో ఇరు పక్షాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో ఇరు గ్రూపుల్లో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వైసిపి కార్యకర్తలు ప్రభుత్వ ఆస్పత్రిలో, టిడిపి కార్యకర్తలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించి మాట్లాడారు. మాచర్లకు టిడిపి ఇన్‌ఛార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నియమితులైన తర్వాత గొడవలు రేపుతున్నారని, ఆయన 7 హత్య కేసుల్లో ప్రధాన నిందితుడని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిఎస్‌పితో మాట్లాడానని తెలిపారు. టిడిపికి పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేకే వైసిపి దాడులకు పాల్పడుతోందని, టిడిపికి చెందిన వారిని హత్య చేసేందుకు పథకాలు పన్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. తాజా ఘర్షణల నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం కదలిరండి : భువనేశ్వరి

ప్రజాశక్తి -పాడేరు, అరుకులోయ (అల్లూరి జిల్లా)


పాడేరులో ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

రాష్ట్ర భవిష్యత్తు కోసం ఐక్యంగా కదిలి రావాలని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కోరారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయలో ఆమె బుధవారం పర్యటించారు. తొలుత అరకులోయ మండలం మాదల పంచాయతీ ముసిరిగూడలో చంద్రబాబు అరెస్టు సమయంలో గుండెపోటుతో మృతి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త సొనాయి బస్సు కుటుంబాన్ని పరామర్శించి రూ.3 లక్షల చెక్కును అందించారు. అనంతరం పాడేరు మండల కేంద్రంలోని అడారి మెట్ట గ్రామంలో గిరిజన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ హాయంలో రాష్ట్రం అరాచకత్వంతో నిండిపోయిందని ఆమె విమర్శించారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతాన్ని కూడా భువనేశ్వరి సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అనురాధ, టిడిపి అరకు ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్.దొన్నుదొర, తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' పదో తేదీకి మార్పు

- సభలోపే అన్ని సీట్లూ ప్రకటిస్తాం : విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-మేదరమెట్ల (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా మేదరమెట్ల జాతీయ రహదారి వద్ద మార్చి మూడున నిర్వహించ తలపెట్టిన సిద్ధం సభను మార్చి పదవ తేదీన జరపాలని పార్టీ నిర్ణయించిందని ఎంపి, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. సభ స్థలిని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మార్చి 13, 14న ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం ఉందని, ఏప్రిల్ రెండో వారంలో ఎన్నికలు జరగవచ్చని తెలిపారు. మేనిఫెస్టోపై కసరత్తు జరుగుతోందని, అతి త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. సిద్ధం సభ లోపే అన్ని సీట్లూ ప్రకటిస్తామన్నారు. పొత్తులు ఎవరు పెట్టుకున్నా ప్రజలు తమ వైపే ఉన్నారని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ

దొంగ ఓట్లపై అప్రమత్తత అవసరం

- ఎన్నికల కమిషన్ విశ్రాంత కమిషనర్ నిమ్మగడ్డ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో దొంగ ఓట్లు ఉన్నాయని అందువల్ల ఓటర్లు జాగ్రత్తగా తమ ఓటును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ విశ్రాంత కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. కాకినాడలోని యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో 'ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే నినాదంతో బుధవారం రాష్ట్ర స్థాయి కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ మాట్లాడుతూ స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ ప్రక్రియలో భాగమని చెప్పారు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలకు సంబంధించి సుమారు 30 వేల దొంగ ఓట్లు నమోదయ్యాయని, ఇటీవల అవి బయటపడడంతో ఇద్దరు ఉన్నత అధికారులను సస్పెండ్ చేసి ఎన్నికల కమిషన్ చేతులు దులుపుకుందన్నారు. ఓటర్లు తమ జాబితాను తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లో తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్ల నియమించుకునే సంస్థ వారి ద్వారా ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి రహస్యంగా ఉంచాల్సిన జాబితాను ప్రభుత్వంలో ఉన్న కొందరు పెద్దలకు చేరవేస్తోందని చెప్పారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని, వలంటీర్లను సచివాలయ సిబ్బందిని ఎన్నికల విధుల్లోకి ఉపయోగించుకోకూడదని సుప్రీంకోర్టులో కేసు వేస్తామని తెలిపారు. ఎన్నికల విధుల్లోకి వలంటీర్లు తీసుకుంటామంటూ సిఎం, మంత్రులు చెప్పడం ఎన్నికల కమిషన్‌ను అవమానించడమేనన్నారు. యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

తేలని ఎసిబి కేసులు


- 2014 నుండి విచారణలోనే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు నమోదు చేసిన కేసుల విచారణ నాన్పుడు ధోరణిలో సాగుతోంది. ప్రధానంగా ఆదాయానికి మించి ఆస్తుల కేసులు తేల్చడంలో ఈ పరిస్థితి నెలకొంది. 2014వ సంవత్సరం నుండి పెద్ద సంఖ్యలో కేసులో విచారణలోనే ఉన్నట్లు చెబుతున్నారు. ఉద్యోగుల నుండి ఒత్తిడి రావడంతో ఈ కేసులకు సంబంధించి ఒక కమిటీని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీ పదుల సంఖ్యలో భేటీలు కావడం తప్ప కేసులను ఒక కొలిక్కి తీసుకురావడం లేదని అంటున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2019లో ఏర్పాటైన ఈ కమిటీ ఇప్పటికే 15 సార్లుకుపైగా భేటీలు నిర్వహించింది. ఉకేసులకు సంబంధించిన వివరాలను అందించాలని ఆయా శాఖలకు సర్క్యులర్లు జారీ చేశారు. ఆ సమాచారాన్ని సేకరించి అనేక పర్యాయాలు చర్చించడం, ఎసిబి నుంచి అభిప్రాయాలు తీసుకోవడం వంటి పనులన్నింటిని పూర్తి చేశారు కానీ, అంతిమఫలితం మాత్రం కనిపించలేదు. ఫిబ్రవరి నెలలో కూడా రెండు సార్లు ఈ కమిటీ సమావేశాలు జరిగాయి. నేడు మరోసారి సమావేశం కానున్నట్లు సమాచారం కేసులను మూడు రకాలుగా విభజించి అధ్యయనం చేయాలని కమిటీ యోచిస్తున్నట్లు తెలిసింది.

ఏడాదిలో 6శాతం పెరిగిన సంపన్నులు

- వచ్చే ఐదేళ్లలో 50% పెరగొచ్చు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్త్ రిపోర్ట్



ముంబయి : భారత్‌లో పేదలు, మధ్య తరగతి వర్గాలు అధిక ధరలతో ఉన్న ఆదాయాలు కోల్పోతుంటే.. మరోవైపు ధనవంతులు మాత్రం మరింత సంపదను పోగేసుకుంటూ పెరిగిపోతున్నారు. ఇందుకు నైట్ ఫ్రాంక్ ఇండియా సంపద 2024 రిపోర్ట్ నిదర్శనం. దీని ప్రకారం.. గడిచిన 2023లో దేశంలో అత్యధిక ఆదాయం కలిగిన సంపన్నులు (యుహెచ్‌ఎన్‌డబ్ల్యుఐ) 6.1 శాతం పెరిగి 13,262 మందికి చేరారు. వచ్చే ఐదేళ్లలో 2028 నాటికి ఈ సంఖ్య 50.1 శాతం ఎగిసి 19,908కి చేరనుందని అంచనా. కాగా.. ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా సంపన్నుల శాఖ 28.1 శాతం పెరిగి 8,02,891కి చేరొచ్చు. 2023లో 4.2 శాతం పెరిగి 6,01,300 నుంచి 6,26,619కు చేరింది. ప్రపంచ సగటుతో పోల్చితే భారత్‌లో అత్యధిక సంపన్నుల పెరుగుదల శాతం చాలా ఎక్కువగా నమోదవుతోంది.

నైట్‌ఫ్రాంక్ రిపోర్ట్ ప్రకారం.. ప్రస్తుత ఏడాది 2024లో 90 శాతం మంది భారత సంపన్నులు వారి ఆదాయాల్లో పెరుగుదలను ఆశిస్తున్నారు. వీరిలో 63 శాతం మంది వారి సంపదలో 10 శాతం కంటే ఎక్కువ పెరుగుదలను కోరుకుంటున్నారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే భారత్‌లో సంపన్నుల పెరుగుదలకు ఎక్కువ అవకాశాలున్నాయి. దేశంలో రానున్న ఐదేళ్లలో సంపన్నుల సంఖ్యలో 50.1 శాతం పెరుగుదల ఉండొచ్చు. ప్రస్తుత ఏడాదిలో 90 శాతం భారత సంపన్నులు తమ సంపదలో పెరుగుదలను ఊహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్‌లో ద్రవ్యోల్బణ ప్రమాదాన్ని తగ్గించడం, వడ్డీ రేట్లలో తగ్గింపులు వృద్ధికి దోహదం చేయవచ్చు." అని నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజల్ పేర్కొన్నారు.

గడియారాలపైనే మోజు..

భారత సంపన్నుల్లో 12 శాతం మంది ఈ ఏడాది కొత్త నివాసాన్ని కొనుగోలు చేయాలనే ప్రణాళికలో ఉన్నారు. 2023లోనూ అంతే శాతం మంది కొత్త ఇళ్లను కొనుగోలు చేశారు. దేశంలో 13వేల పైగా ఉన్న అత్యంత సంపన్నులు 2.57 గృహాలను కలిగి ఉన్నారని నైట్ ఫ్రాంక్ సర్వేలో తేలింది. లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లలో గడియారాలకు ఎక్కువ మంది ప్రాధాన్యత ఇచ్చారు. ఆ తర్వాత కళారూపాలు, అభరణాలు, క్లాసిక్ కార్ల కొనుగోలుకు ఎక్కువ ఆసక్తి చూపారు.

రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

- సెన్సెక్స్ 790 పాయింట్ల పతనం
- రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి షేర్ల డీలా



ముంబయి : దిగ్గజ కార్పొరేట్ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ సూచీల్లో అమ్మకాల ఒత్తిడి స్టాక్ మార్కెట్లను పడేశాయి. మరోవైపు అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు మరింత ఒత్తిడిని పెంచాయి. ఈ పరిణామాలతో బుధవారం తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 790 పాయింట్లు లేదా 1.08 శాతం పతనమై 72,304కు పడిపోయింది. నేషనల్ స్టాక్ ఎక్సేంజీ నిఫ్టీ 247 పాయింట్లు కోల్పోయి.. 21,951 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 72,222, నిఫ్టీ 21,916 కనిష్టాలను చవి చూశాయి. బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.6 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. దీంతో ఆ మొత్తం ఇన్వెస్టర్ల సంపద ఆవిరయినట్లయ్యింది. బిఎస్‌ఇ మార్కెట్ విలువ రూ.386 లక్షల కోట్లకు తగ్గింది.

బిఎస్‌ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.8 శాతం, 1.9 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. నిఫ్టీలో మీడియా, రియాల్టీ, లోహ, పిఎస్‌యు బ్యాంకింగ్ స్టాక్స్ 2 శాతం నుంచి 3.5 శాతం మేర క్షీణించాయి. ఇతర రంగాల సూచీలన్నీ 1.5 శాతం మేర పతనమయ్యాయి. సెన్సెక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని షేర్లూ క్షీణతను చవి చూశాయి. ఆసియా, పసిఫిక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. విదేశీ సంస్థాగత మదుపరులు అమ్మకాలకు మొగ్గు చూపారు.



సునీల్ మిట్టల్‌కు బ్రిటన్ నైట్‌హుడ్ అవార్డ్

న్యూఢిల్లీ : భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీల్ భారతీ మిట్టల్‌కు బ్రిటన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారం ప్రకటించింది. ఆ దేశ ప్రతిష్టాత్మక పురస్కారమైన నైట్‌హుడ్‌తో సత్కరించింది. కింగ్ ఛార్లెస్ 3 చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్న తొలి భారతీయుడుగా సునీల్ మిట్టల్ నిలిచారు. తనకు ఈ అవార్డు దక్కడం గౌరవంగా భావిస్తున్నానని మిట్టల్ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు.

మృతదేహంతో కార్మికుల ధర్నా

- న్యాయం చేస్తామని అధికారుల హామీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రహదారిపై ధర్నా చేస్తున్న కార్మికులు

చెత్త తరలింపు ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన పారిశుధ్య కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నాకు దిగారు. విధులు బహిష్కరించి పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, రెండు సెంట్ల స్థలంతోపాటు కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్, జిల్లా గౌరవాధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుడు దేవంగి కోటయ్య విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఈ నెల 17న ప్రమాదవశాత్తు చెత్త తరలింపు ట్రాక్టర్ ఢీకొందని, అప్పటి నుండి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతి చెందారని తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఉదయం 6 గంటల నుండి ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. కమిషనర్ సి.రవించంద్రరెడ్డి ధర్నా వద్దకు వచ్చి నాయకులతో మాట్లాడారు. డిమాండ్లను అంగీకరిస్తున్నట్లు హామీ ఇచ్చారు. లిఖిత పూర్వక హామీకి పట్టుబట్టడంతో రూ.20 లక్షల పరిహారం, రెండు సెంట్ల ఇంటి స్థలం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి పారిశుధ్య విభాగంలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం ఇస్తామని లిఖితపూర్వకంగా కమిషనర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జాగల్‌తో ఈజీమైట్రిప్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : ఫిన్‌టెక్ సేవల సంస్థ జాగల్ ప్రీపెయిడ్ ఓసియన్ సర్వీసెస్‌తో ఈజీమైట్రిప్ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో తమ సంస్థకు ట్రావెల్, వ్యయాల నిర్వహణ పరిష్కారాలను జాగల్ అందించనుందని పేర్కొంది.

ప్రయాణ సమయంలో వాస్తవ ఖర్చులను అంచనా వేయడానికి వీలుంటుందని పేర్కొంది. వ్యయాల పొదుపు, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదం చేయనుందని ఈజీమైట్రిప్ పేర్కొంది.

శ్రీలంక శీతల పానీయాల కంపెనీతో రిలయన్స్ జట్టు

న్యూఢిల్లీ : శ్రీలంకకు చెందిన ఎలిఫ్యాంట్ హౌస్ శీతలపానయాల కంపెనీతో రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. దీంతో మరిన్ని కూల్‌డ్రింక్స్‌ను తీసుకురావాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే కాంపా కోలా, సోస్యో తదితర బ్రాండ్లతో రిలయన్స్ శీతల పానియాలను విక్రయిస్తోంది.



ఎలిఫ్యాంట్‌తో జట్టు కట్టడం ద్వారా రిలయన్స్ బేవరేజ్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోను విస్తరించడమే కాకుండా.. కొత్త ఉత్పత్తులను భారతీయ వినియోగదారులకు అందించాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ఎలిఫ్యాంట్ హౌస్ తన పోర్టుపోలియోలో నెక్టో, క్రీమ్ సోడా, ఇజిబి, ఆరెంజ్ బార్లీ, లెమనేడ్ తదితర శీతల పానియాలను కలిగి ఉంది.

సంపాదకీయం


నారీశక్తి

మాటలు కోటలు దాటినా, ఆచరణ అడుగు కూడా పడకపోతే ఏమవుతుందనడానికి అత్యున్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం ఎదుర్కున్న పరిస్థితే నిదర్శనం. ప్రధానితో సహా కేంద్ర మంత్రులు పదేపదే చెప్పిన మాటలనే ఉదహరిస్తూ న్యాయమూర్తులు నిలదీస్తుంటే ఏం జవాబు చెప్పాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ న్యాయవాదులు పడిపోయారు. లింగ వివక్ష కేంద్రంగా దాఖలైన ఒక కేసు విచారణ సందర్భంగా ఈ పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి ఏర్పడింది. కోస్ట్ గార్డ్ (తీర రక్షక దళం)లో మహిళా అధికారులు శాశ్వత నియమాకాల్లో ఎదుర్కుంటున్న వివక్షను ఎత్తిచూపుతూ దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి తలంటింది. '21వ శతాబ్దంలో ఉన్నాం...ఇంకా పాతరాతి యుగపు ఆలోచనలేనా?' అంటూ నిలదీసింది. ఏళ్ల తరబడి షార్ట్ సర్వీస్ కమిషన్‌లో సేవలందించిన తనతో పాటు అర్హులైన ఇతర మహిళా అధికారులతో శాశ్వత కమిషన్ ఏర్పాటు చేసి తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసేలా ఆదేశించాలంటూ ఒక అధికారిణి దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం స్పందించిన తీరు హర్షణీయం. షార్ట్ సర్వీసు కమిషన్‌కు ఎంపికైన అభ్యర్థులు నిర్దేశించిన కాలపరిమితి మేరకు పని చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత కూడా విధుల్లో కొనసాగాలని భావించిన వారు దరఖాస్తు చేసుకుంటే, శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేసి, వారి అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తారు. ఇండియన్ ఆర్మీలో 1965 ఫిబ్రవరిలో మొట్టమొదటిసారిగా ఈ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. అయితే, ఇది పురుషులకు మాత్రమే పరిమితం. మహిళలను త్రివిధ దళాల్లోకి అనుమతించే వారే కారు. అయితే, 2020లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆ పరిస్థితి మారింది. ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీలలోని సాయుధ దళాల్లోకి సైతం మహిళలకు తలుపులు తెరుచుకున్నాయి. కానీ, 1977లో ఏర్పాటైన కోస్ట్‌గార్డ్ మాత్రం వివక్షాపూరిత ధోరణినే ఇంకా కొనసాగిం చడం, దానికి కేంద్ర ప్రభుత్వ పెద్దలు తలలాడించడం దారుణం!

మహిళ అన్న కారణంతో తనకు సమాన అవకాశాలు తిరస్కరించారంటూ దాఖలైన ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ కోస్ట్‌గార్డ్‌లో నెలకొన్న పరిస్థితికి విస్తుపోయింది. 'నారీ శక్తి అంటూ పెద్ద పెద్ద మాటలు చెబుతారు కదా! ఇప్పుడు సమయం వచ్చింది. చేసి చూపండి. మీరు నడి సముద్రంలో చిక్కుకున్నారు. మీకు మరో మార్గం లేదు. మహిళలకు వారి వాటా ఇవ్వాల్సిందే. ఈ మేరకు విధానం రూపొందించండి' అని నిర్దేశించింది. ఈ సూచన చేసిన వారం రోజుల తరువాత జరిగిన మలి విచారణలోనూ కేంద్ర ప్రభుత్వ విధానంలో ఇసుమంత మార్పు కూడా రాకపోవడం మహిళల పట్ల వారి దృష్టి కోణానికి నిదర్శనం. కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకట రమణి 'త్రివిధ దళాలతో పోలిస్తే కోస్ట్‌గార్డ్‌లో పనిపరిస్థితులు భిన్నంగా ఉంటాయని చెప్పడంతో '2024లో అటువంటి వాదనలు పనిచేయవు. మీరు చేయలేకపోతే మేమే చేస్తాం.' అని ధర్మాసనం హెచ్చరించింది. ఒక దశలో ఇప్పటికే పది శాతం శాశ్వత ఉద్యోగాలు ఇస్తున్నామని ప్రభుత్వం తరపు నుండి చెప్పడంతో '10 శాతమే ఎందుకు? పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువని భావిస్తున్నారా?.' అని నిలదీసింది. మార్చి ఒకటవ తేదీన ఈ కేసులో తదుపరి విచారణ జరగనుంది. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో ఏ మేరకు మార్పు వస్తుందో చూడాలి!

నిజానికి, పుట్టినప్పటి నుండి మరణించే వరకు మహిళలకు ఎన్నో కట్టుబాట్లు పెట్టిన సమాజం మనది. కడుపు నిండా తినడానికి, కంటి నిండా నిద్ర పోవడానికి, నోరారా నవ్వడానికి కూడా ఎన్నో ఆంక్షలు! ఈ సంకెళ్లను తెంచుకోవడానికి భారతీయ మహిళల పోరాటం కొనసాగుతోంది. 2020లో సుప్రీంకోర్టు తీర్పు తరువాత త్రివిధ దళాల్లో మహిళల సంఖ్య 11,414కు చేరింది. ఆర్మీలోనే 7,054 మంది చేరారు. వీరిలో 10 మంది ఈ ఏడాదే తమతమ విభాగాల్లో అత్యున్నత స్థాయికి చేరారు. స్వాతంత్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ ఏర్పాటు చేసిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కెప్టెన్ లక్ష్మీ సెహగల్ నేతృత్వంలో కదం తొక్కిన ఘన చరిత్ర మన నారీ లోకానిది. అన్ని రంగాల్లోనూ సమాన హక్కుల సాధనకు ఆ పోరాట స్ఫూర్తే ఆదర్శం.

మహనీయుల మాట



సామాజిక ఉత్పత్తికి తోడ్పడే శ్రమకు ఉపకరించే విధంగా విద్య ఉండాలి.


- వి.ఐ.లెనిన్

గృహ వినిమయ వ్యయ గణాంకాలు - మోడీ ప్రభుత్వ వక్రబుద్ధి

విశ్లేషణ



డా|| బి.గంగారావు



నయా ఉదారవాద కాలంలో దేశంలో పోషకాహార పేదరికం బాగా పెరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కుటుంబ ఆరోగ్య సర్వే కూడా 15-49 వయస్సు గల మహిళల్లో రక్తహీనత 2015-16లో 53 శాతం నుండి 2019-20కి 58 శాతానికి పెరిగిందని తేల్చి చెప్పింది. ఈ కఠోర వాస్తవాలన్నింటిని మరుగున పెట్టి 2022-23 కుటుంబ వినిమయ సర్వే సంక్షిప్త నివేదికను తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటూ దేశాన్ని మోసం చేస్తున్నది. 2021లో పూర్తి చేయాల్సిన జనాభా లెక్కలను కూడా ప్రారంభించకుండా అనేక వివాదాలను సృష్టించి వాయిదా వేస్తూ వస్తున్నది. ఈ సర్వే జరిగితే మోడీ పదేళ్ళ అభివృద్ధి బండారం బట్టబయలౌతుంది.

పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడటంతో ఆగమేఘాల మీద 2022-23 గృహ వినియోగ వ్యయ సర్వే నివేదికను నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం విడుదల చేసింది. అది కూడా పూర్తి నివేదిక కాదు. కేవలం 27 పేజీల సంక్షిప్త 'వాస్తవ నివేదిక' (ఫ్యాక్ట్ షీట్) పేర ప్రకటించారు. 2023-24 రెండో సర్వే ఇంకా కొనసాగుతున్నది. ఇది పూర్తయిన తరువాత రెండు సర్వేల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా పరిగణలోకి తీసుకొని సంపూర్ణ నివేదికను విడుదల చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇది సాధ్యపడదు. నూతన వినియోగ ధరల సూచీని నిర్ధారించటానికి అవసరమైన ప్రాథమిక పున:పరిశీలన, మార్కెట్ సర్వే, వస్తువులకు తగిన వెయిటేజ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇవన్నీ ఇంకా జరగక ముందే సంక్షిప్త నివేదికతో ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. తప్పుడు ప్రచారానికి పూనుకుంటూ ప్రజలను మోసగిస్తున్నది.

పదకొండేళ్ల సుదీర్ఘ విరామం తరువాత సరేంద్ర మోడీ ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో నిర్వహించిన గృహ వినియోగ వ్యయ సర్వే గణాంకాలను విడుదల చేసింది. వాస్తవంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి దేశంలో ప్రజల వినిమయ స్థితిగతులను తెలుసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ ద్వారా సర్వే నిర్వహిస్తుంది. భారతదేశంలో ఆదాయ సర్వేలు లేనందున ఈ వినిమయ గణాంకాల ద్వారానే ఆదాయ ధోరణులు తెలుసుకోవటానికి కూడా దీనిని ఉపయోగిస్తున్నారు. అంటే ఒక కుటుంబం నెలకి ఎంత ఖర్చు చేస్తుందో ఈ సంఖ్యల నుండి ఎంత ఆదాయం సంపాదిస్తున్నారో సుమారుగా అంచన వేయవచ్చు. దీనికి ముందు 2017-18 కాలంలో నిర్వహించిన గృహ వినిమయ వ్యయం సర్వేను విడుదల చేయకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం తొక్కి పెట్టింది. 2016లో పెద్ద నోట్ల రద్దు, 2017లో ప్రవేశపెట్టిన జిఎస్టీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవటంతో దేశ ప్రజలపై తీవ్ర ప్రభావం పడి వారి కుటుంబ వినియోగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ వాస్తవాలు సర్వేలో నిరూపణై బహిర్గతం కావడంతో మోడీ ప్రభుత్వం భగ్గుమన్నది. దీంతో సర్వే డేటా సక్రంగా లేదనే సాకు చెప్పి సర్వే ఫలితాలను విడుదల చేయకుండా కప్పిపుచ్చేసింది.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 2,61,746 కుటుంబాల నుండి 2022-23 సర్వే నిర్వహించింది. ఇందులో 8723 గ్రామాల నుండి 1,50,514 కుటుంబాలు, 6115 పట్టణాల నుండి 1,06,732 కుటుంబాలు ఉన్నాయి. సర్వే వివరాలను పరిశీలిస్తే 2011-22లో గ్రామీణ ప్రాంతాల్లో తలసరి వినియోగం రూ.1430 ఉంటే, 2022-23 నాటికి రూ.3773కు చేరింది. పట్టణ ప్రాంతాల్లో ఇదే కాలంలో తలసరి వినియోగం చూస్తే సగటు తలసరి వినియోగం రూ.2630 నుండి రూ.6459కి పెరిగింది. 2011-12 నాటి ధరల సూచీ ప్రకారం చూస్తే సగటు తలసరి వినిమయ వ్యయం గ్రామీణ ప్రాంతంలో రూ.1430 నుంచి రూ.2008కి అంటే వార్షిక వృద్ధి రేటు 4 శాతం, పట్టణ ప్రాంతాలల్లో రూ.2630 నుంచి రూ.3510కి అంటే ఏడాదికి 3 శాతం వృద్ధి రేటుగా నమోదయ్యింది.

సామాజిక తరగతుల వారీగా చూస్తే గిరిజనులలో నెలవారీ సగటు వినియోగ వ్యయం 2022-23లో గ్రామీణ ప్రాంతంలో రూ.3016, దళితుల్లో రూ.3474, ఓబిసిల్లో రూ.3848, ఇతరుల్లో రూ.1392గా ఉన్నట్లు సర్వే నివేదిక పేర్కొన్నది. అలాగే పట్టణ ప్రాంతాల్లో గిరిజనుల్లో రూ.5414, దళితుల్లో రూ.5307, ఓబిసిల్లో రూ.6177, ఇతరుల్లో రూ.7333 నెలవారీ సగటు వినిమయ వ్యయం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు, దళితులు దేశ సగటు వ్యయం కంటే వారి వినిమయం చాలా తక్కువగా ఉంది, ఓబిసిల్లో సగటు కంటే కొంచెం ఎక్కువగా కన్పిస్తున్నది. అదే పట్టణ ప్రాంతాల్లో అయితే గిరిజన, దళిత, ఓబిసి మూడు తరగతులు దేశ సగటు వినిమయం కన్నా అథమ స్థితిలో ఉన్నారు. ఈ తరగతులకు అగ్ర వర్ణాలకు మధ్య వినియోగ వ్యయంలో చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది.

సర్వే నివేదిక మరొక అంశాన్ని కూడా నిర్ధారించింది. పేద-ధనికుల మధ్య వినిమయ అంతరాలను కూడా గణించింది. దేశ జనాభాలో అట్టడుగు 5శాతం నిరుపేదలు సగటున నెలకి గ్రామీణ ప్రాంతంలో రూ.1373 ఖర్చు చేస్తుంటే, అదే పైనున్న 5 శాతం ధనికులు నెలకు సగటున తలసరి రూ.10,501 ఖర్చు చేస్తున్నారు. అదే పట్టణ ప్రాంతాల్లో కింది స్థాయి పేదలు రూ.2001 ఖర్చు చేస్తుంటే పైస్థాయిలోని 5 శాతం ధనికులు నెలకి సగటున తలసరి రూ.20,824 ఖర్చు చేస్తున్నారు. రోజువారీగా చూస్తే కింది స్థాయి. పేదలు రోజుకి సగటున రూ.46, పట్టణ ప్రాంతాల్లో రూ.67 ఖర్చు చేస్తుంటే, ధనవంతులు గ్రామాల్లో రోజుకి రూ.350, పట్టణ ప్రాంతాల్లో రూ.700 ఖర్చు చేస్తున్నారు. స్థూలంగా గ్రామీణ ప్రాంతంలో 8 రెట్లు, పట్టణ ప్రాంతాలో 10 రెట్లు పేదల కంటే ధనికులు ఎక్కువగా వినిమయం చేస్తున్నారు. ప్రజల మధ్య వినిమయ అంతరాలు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నయో అర్థం చేసుకోవచ్చు. వివిధ వినిమయ తరగతుల వారీగా వ్యయాన్ని పరిశీలిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 70 శాతం ప్రజలు సగటు వినిమయం కంటే వెనుకబడి ఉన్నారు.

ఈసారి ప్రభుత్వ సంక్షేమ పథకాల నుండి ప్రజలకు అందుతున్న వాటి విలువను కూడా ప్రత్యేకంగా లెక్కగట్టి వినియోగ వ్యయంలో కలిపారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా తలసరి నెలకు 5 కిలోల చొప్పున అందుతున్న బియ్యం లేదా గోధుమలు, స్కూలు యూనిఫామ్‌లు, లాప్టాప్‌లు, సైకిళ్లు, మొబైళ్ల తదితర వాటినన్నింటిని పరిగణలోకి తీసుకొని విడుదల చేసిన ఫలితాలు చూస్తే కళ్లు తెరిపిస్తాయి. వీటి విలువను కూడా పరిగణలోకి తీసుకుంటే ప్రతి వ్యక్తి నెలకు అదనంగా రూ.87 ఖర్చు చేస్తున్నట్లు తేల్చారు.

వివిధ ఖర్చులను చూస్తే ఆహారం మీద పెడుతున్న ఖర్చు ఈ పదేళ్ళల్లో తగ్గినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గడిచిన 11 ఏళ్ళలో ఆహారంపై ఖర్చు గ్రామీణ ప్రాంతంలో 46 శాతం, పట్టణ ప్రాంతంలో 39 శాతానికి తగ్గింది. తొలిసారిగా ప్రజలు ఆహారంపై చేసే వ్యయం 50 శాతం లోపుకు పడిపోయింది. అలాగే ఆహారేతరాలపై పెట్టే వ్యయం గ్రామీణ ప్రాంతంలో 54 శాతం, పట్టణ ప్రాంతంలో 61 శాతానికి పెరిగింది. దీనిని కూడా ప్రభుత్వం తన ఘనకార్యంగా చెపుకుంటున్నది. వాస్తవంగా సర్వే కాలానికి ముందే ఆహార వస్తువుల ధరలు, రిటైల్డ్ ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. దీనివల్ల ఆహార వస్తువులపై వినిమయం తగ్గిండొచ్చు. అలాగే విద్య, వైద్యం, రవాణా, ఇంటి అద్దెలు వంటి కొన్ని ముఖ్యమైన వాటిపై అదనంగా ఖర్చు చేయాల్సిన అనివార్య పరిస్థితి ప్రభుత్వం సృష్టించింది. 2022-23 ప్రజల వినిమయ వ్యయంలో దేశంలో ఆంధ్ర రాష్ట్ర స్థానాన్ని చూస్తే గ్రామీణ ప్రాంత వ్యయంలో 15వ స్థానంలోను, పట్టణ ప్రాంతంలో 17వ స్థానంలో ఉంది.

ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఈ అంకెలను చూపి అభివృద్ధి ప్రకటనలు గుప్పిస్తున్నది. ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయని, ప్రజల వినియోగ వ్యయం పెరుగుదలే ఇందుకు తార్కాణమని ఊదరగొడుతున్నది. ప్రజల మధ్య ఆదాయ అంతరాలు కూడా తగ్గుముఖం పట్టాయనే ప్రచారానికి కూడా ఈ నివేదికను వాడుకుంటున్నది. వాస్తవంగా ఈ సర్వేని 2011-12 సర్వేతో పోల్చి విశ్లేషణ చేయడం సరైంది కాదు. ఎందుకంటే గత సర్వే కేవలం ఒక ప్రశ్నావళి ద్వారానే కుటుంబాల నుండి సమాచారాన్ని సేకరించింది. 2022-23 సర్వేలో 4 ప్రత్యేక ప్రశ్నావళుల ద్వారా మూడుసార్లు ఇళ్ల నుండి సమాచారం తీసుకున్నారు. ఈ సర్వేలో గ్రామీణ ప్రాంతాలను ఎక్కువ భాగం జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను ఎంపిక చేశారు. అలాగే భూమిని కూడా ప్రామాణికంగా ఎంచుకున్నారు. పట్టణ ప్రాంతంలోనైతే 10 లక్షల పైబడి, 10 లక్షల లోపు విలువ గల కారు యజమాని కుటుంబాలను కూడా ప్రత్యేకంగా సర్వేలో తీసుకున్నారు. అలాగే గతంలో సర్వేలో ఉండి, ప్రస్తుతం ప్రజల వినియోగంలో లేని వస్తువులను సర్వే నుండి తొలగించి, కొత్త వినిమయ వస్తువులను ఈ సర్వేలో చేర్చారు. ఫలితంగా సర్వే వస్తువుల సంఖ్య 347 నుండి 405కి పెరిగాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా లెక్కించి వినిమయ ఖర్చులో కలిపారు. గతంలో ఇది లేదు.

ఈ సర్వే ధరల పెరుగుదలను, రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకోలేదు. కోవిడ్ రెండేళ్ల కాలంలో ప్రజల ఆదాయ వ్యయాలు దారుణంగా పడిపోయాయి. ఆ తరువాత కాలంలో నెమ్మదిగా కోలుకొని సర్వే కాలం నాటికి కొంత వినిమయాన్ని పెంచుకున్నారు. దీనివల్ల ప్రజల వ్యయంలో ఒక్కసారిగా పెరుగుదల మనకి కన్పిస్తుంది. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని తొక్కిపెట్టి ప్రజల వినిమయం పెరిగినట్లు చూపిస్తున్నది.

ఈ సర్వే గణాంకాలను చూపి దేశంలో పేదరికం 5 శాతం లోపుకి తగ్గిపోయిందనే ప్రచారానికి కూడా ఒడిగట్టింది. నీతి ఆయోగ్ సిఇఓ ద్వారా ప్రచారంలో పెట్టింది. దీంతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వం విడుదల చేసిన 27 పేజీల వాస్తవ నివేదికలో పేదరికం తగ్గిందని ఎక్కడా ప్రస్తావించలేదు. పైపెచ్చు ప్రభుత్వం పేదరికం తగ్గిందని చూపిస్తున్న మదింపు లెక్కలు కూడా పూర్తిగా అశాస్త్రీయమైనవి. ఇందుకు ఎటువంటి ప్రతిపాదిక లేదు. దేశంలో పేదరిక గీతకు సంబంధించి టెండూల్కర్ కమిటీ లేదా ప్రణాళికా సంఘం చేసిన సిఫార్సులకు లేదా ఇప్పటి వరకు దేశ పేదరికం లెక్కలకు సంబంధించి అనుసరిస్తూ వస్తున్న విధానానికి ఇది పూర్తిగా విరుద్ధమైనది.


భారతదేశంలో 2011 నుండి పేదరిక లెక్కలు విడుదల చేయడంలేదు. ప్రణాళికా సంఘం రద్దయిన తరువాత ఉనికిలోకి వచ్చిన నీతి ఆయోగ్ కూడా దారిద్ర్య రేఖకు ఎలాంటి కొలమానాలను రూపొందించలేదు. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన లెక్కల ప్రకారం 11 శాతం మంది అంటే 18.9 కోట్ల మంది ప్రజలు భారత దేశంలో ఆకలితో అలమటిస్తున్నారని పేర్కొన్నది. అలాగే ప్రపంచ ఆకలి సూచిలో 125 దేశాల్లో భారత్‌దేశం 111వ స్థానంలో ఉంది. ప్రతి నలుగురు భారతీయుల్లో ముగ్గురు అతి తక్కువ ఆహారం తీసుకుంటున్నట్లు చెప్పింది. అంతేగాక గ్రామీణ ప్రాంతంలో రోజుకి 2200 క్యాలరీలు, పట్టణ ప్రాంతంలో రోజుకి 2100 క్యాలరీలు ఆహారం పొందాలంటే ప్రస్తుత ధరల ప్రకారం మదింపు చేస్తే దేశంలో 58 శాతం పేదరికంలో మగ్గుతున్నట్లు తెలుస్తున్నది.

నయా ఉదారవాద కాలంలో దేశంలో పోషకాహార పేదరికం బాగా పెరిగిందని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కుటుంబ ఆరోగ్య సర్వే కూడా 15-49 వయస్సు గల మహిళల్లో రక్తహీనత 2015-16లో 53 శాతం నుండి 2019-20కి 58 శాతానికి పెరిగిందని తేల్చి చెప్పింది. ఈ కఠోర వాస్తవాలన్నింటిని మరుగున పెట్టి 2022-23 కుటుంబ వినిమయ సర్వే సంక్షిప్త నివేదికను తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకుంటూ దేశాన్ని మోసం చేస్తున్నది. 2021లో పూర్తి చేయాల్సిన జనాభా లెక్కలను కూడా ప్రారంభించకుండా అనేక వివాదాలను సృష్టించి వాయిదా వేస్తూ వస్తున్నది. ఈ సర్వే జరిగితే మోడీ పదేళ్ళ అభివృద్ధి బండారం బట్టబయలౌతుంది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కె.జి బేసిన్‌లో మనది న్యాయమైన హక్కు

వ్యాసం



డా|| కొల్లా రాజమోహన్

కృష్ణ-గోదావరి బేసిన్ మన రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో వ్యాపించి ఉన్నది. ఒ.యన్.జి.సి ఆస్తులన్నింట్లోకి అత్యంత ఎక్కువ ఉత్పాదకత కలిగిన వాటిలో కె.జి. బేసిన్ ముఖ్యమైనది. ఇంతటి సంపద్వంతమైన కె.జి. బేసిన్ నిల్వలు ముంగిట్లో వున్నా ఆంధ్ర ప్రజలకు అందుబాటులో లేకపోవడమే విషాదం.

కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుండి 2024, జనవరి 7న ముడిచమురు ఉత్పత్తి ప్రారంభమవటమే తాజా పరిణామం. కృష్ణ-గోదావరి బేసిన్‌లో సహజ వాయువుతో పాటుగా చమురు ఉత్పత్తి విలువ కొన్ని లక్షల కోట్లకు మించి ఉంటుందని అంచనా. 21వ శతాబ్దంలో సంపన్న శక్తివంతమైన దేశమంటే చమురు, సహజ వాయువు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని అర్థం. ఆంధ్ర తీరంలో వున్న చమురు నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చబోతున్నాయి. దీనివలన ఆంధ్ర ప్రాంత ప్రజలు సర్వతోముఖాభివృద్ధిని సాధించవచ్చు. కానీ బడా కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యానికి కేంద్ర పాలకులు లొంగిపోవటం వలన ఆంధ్రప్రజలు సంపదలకు దూరమయ్యారు. కేంద ప్రభుత్వ వివక్ష వలన ఆంధ్ర రాష్ట్రం మరింత నష్టపోతున్నది.

లీటర్ పెట్రోల్ పది రూపాయలకే ఇవ్వొచ్చు!

కేవలం విద్యుత్ ఉత్పాదనలోనేకాక ఎరువుల తయారీలో కూడా సహజ వాయువు ఎంతగానో ఉపయోగపడుతుంది. దాంతోపాటు చౌకగా లభించే గ్యాస్ ఆధారిత విద్యుత్తును అందించటం ద్వారా సిమెంట్, సెరామిక్, రసాయనిక, అల్యూమినియం, స్టీల్ ప్లాంట్, ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలలో ఖరీదైన విద్యుత్ మీద ఆధారపడటం తగ్గుతుంది. విశాఖ ఉక్కు కర్మాగారానికి గ్యాస్ సరఫరా చేస్తే సంవత్సరానికి రూ.1200 కోట్లకు మించి ఖర్చు తగ్గుతుందని 2010లోనే అంచనా వేశారు. కె.జి.బేసిన్ గ్యాస్ న్యాయమైన ధరకు చాలినంత లభిస్తే కాకినాడ నుండి విశాఖపట్నం వరకు కాలుష్య రహిత రసాయనిక పరిశ్రమల కారిడార్‌ను నెలకొల్పవచ్చు.


కె.జి బేసిన్‌లో రోజుకి కొన్ని మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ నిక్షేపాలు కనుగొన్నారు. కేవలం ఒక్క ఎం.ఎం.ఎస్.సి.ఎం.డి యూనిట్ గ్యాస్, సుమారు రూ.1000 కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడిని ఆకర్షించగలదని నిపుణుల అంచనా. అంటే కె.జి బేసిన్ గ్యాస్‌లో సగాన్ని ఉపయోగించుకున్నా మనం లక్ష కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించవచ్చు. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కలిగించవచ్చు. రవాణా రంగంలో బస్సులకు, లారీలకు, కార్లకు, ఆటోలకు సిఎన్‌జి గ్యాస్ వాడకం వల్ల ఖర్చు తగ్గటమే కాకుండా కాలుష్యం నుండి పర్యావరణాన్ని కూడా రక్షించుకోవచ్చు. గృహ అవసరాలకు గ్యాస్ పైపుల ద్వారా అతి చౌకగా వంటగ్యాస్ అందించవచ్చు. దీని మూలంగా గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వ సబ్సిడీ భారం తగ్గుతుంది. ప్రస్తుతం వెయ్యి రూపాయలకు పైగా ఖరీదవుతున్న వంట గ్యాస్ సిలిండర్‌కు సమానమైన గ్యాస్‌ను పైపులైన్ ద్వారా వంద రూపాయలకే ఇవ్వవచ్చు. అలానే లీటర్ పెట్రోలును పది రూపాయలకే వాహనదారులకు అందించవచ్చు.

నూతన పాలసీతో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం

సహజ వనరులన్నీ 1990 వరకు ప్రభుత్వ అధీనంలో వుండేవి. ప్రభుత్వ రంగ సంస్థలైన 'ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్' (ఒఎన్‌జిసి), 'ఆయిల్ ఇండియా కార్పొరేషన్' (ఐఒఎల్) సహజ వాయువును, చమురును అన్వేషించి, వెలికితీసి ఉత్పత్తి చేసేవి. మరో ప్రభుత్వరంగ సంస్థ గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జిఎఐఎల్) పైపుల ద్వారా రవాణా చేసి అమ్మకాలు సాగించేది. విదేశీ సంస్థల భాగస్వామ్యం కొంత వున్నా ఈ సంస్థలన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండేవి. ఆ తర్వాత క్రమంలో ప్రభుత్వంతో పనులు చేయించుకోవటంలో మెలకువలు తెలిసిన రిలయన్స్ లాంటి బడా కార్పొరేట్ సంస్థలు రంగప్రవేశం చేశాయి. ఇవి ప్రభుత్వ సంస్థలను రద్దు చేయకుండానే వాటి పునాదిని ఉపయోగించుకుని విపరీతమైన లాభాలను గడించాయి.

అంగట్లో అన్నీ వున్నా...

సహజ వాయువు, చమురు నిక్షేపాలు మన ముంగిట్లో అంటే కె.జి.బేసిన్‌లో పుష్కలంగా ఉన్నా ఆ వనరులను ఉపయోగించుకోలేని దుస్థితిలో మనం ఉన్నాం. దీనికి ప్రధాన కారణం కె.జి.బేసిన్ గ్యాస్ సంపద రాష్ట్ర సరిహద్దులు దాటి తరలిపోవడం. సహజ న్యాయ సూత్రాల ప్రకారం కె.జి.బేసిన్‌లో లభ్యమయ్యే సహజ వాయువు మన రాష్ట్ర అవసరాలు తీరిన తర్వాతనే మన సరిహద్దులు దాటిపోవాలి. సహజ వనరుల యాజమాన్యం, నియంత్రణ ఆ ప్రాంత ప్రజలందరి ప్రయోజనాలను న్యాయమైన రీతిలో కాపాడేటట్లుగా రాజ్య వ్యవస్థ వ్యవహరించాలని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెప్తున్నాయి.



సహజ న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బేసిన్‌లో లభ్యమవుతున్న సహజ వాయువు మన సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు తరలిపోతున్నది. 45.50 శాతం గ్యాస్‌ను గుజరాత్‌కు తరలిస్తున్నారు. 24 శాతం మహారాష్ట్రలోని పరిశ్రమలకు ఇచ్చేస్తున్నారు. మిగిలిన దాన్ని ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలకు 1.2 శాతాన్ని మాత్రమే కేటాయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం, పటిష్టమైన ప్రజా పోరాటాలు సాగని ఫలితంగా మన సహజ సంపద తరలిపోతున్నది.

సహజ న్యాయానికి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బేసిన్‌లో లభ్యమవుతున్న సహజ వాయువు మన సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు తరలిపోతున్నది. 45.50 శాతం గ్యాస్‌ను గుజరాత్‌కు తరలిస్తున్నారు. 24 శాతం మహారాష్ట్రలోని పరిశ్రమలకు ఇచ్చేస్తున్నారు. మిగిలిన దాన్ని ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలకు 1.2 శాతాన్ని మాత్రమే కేటాయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు, రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం, పటిష్టమైన ప్రజా పోరాటాలు సాగని ఫలితంగా మన సహజ సంపద తరలిపోతున్నది.

ప్రహసనంగా మారిన ధరల నిర్ణయం!

కె.జి.బేసిన్‌లో సహజవాయువు ధరను నిర్ణయించటం ఒక ప్రహసనంగా మారింది. రిలయన్స్ కంపెనీ ప్రవేశించే వరకూ గెయిల్ సంస్థ ల్యాంకో పరిశ్రమకు యూనిట్ ఒకటికి 1.97 డాలర్లకు సరఫరా చేస్తున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌కు కె.జి.బేసిన్ నుండి ఒక యూనిట్ గ్యాస్‌ను 2.97 డాలర్లకు సరఫరా చేస్తానని రిలయన్స్ కంపెనీ అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. తదనంతరం ప్లేట్ ఫిరాయించి 4.3 డాలర్లకైతేనే గ్యాస్ ఇస్తామన్నది. ఇంత ఎక్కువ ధరలు నిర్ణయించటానికి శాస్త్రీయ ఆధారాలు లేవని, ఆ ధరకు గ్యాస్ కొనుగోలు చేస్తే ఎరువులు, విద్యుత్ ఉత్పత్తి, తదితర పరిశ్రమలకు భారం అధికమవుతుందన్న నాటి కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి జైపాల్ రెడ్డిని ఆ శాఖ నుండి తప్పించేశారు. ధర పెంచటం అన్యాయమన్న కేంద్ర కార్యదర్శుల కమిటీ నిర్ణయాన్ని ఆమోదించలేదు. రంగరాజన్ అధ్యక్షతనగల ప్రధాన ఆర్థిక సలహా మండలి నిర్ణయాన్ని ఒప్పుకోలేదు. ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం ఒక మంత్రుల కమిటీని నియమించింది. ఆ కమిటీ ఏదో ఘనకార్యం చేసినట్లుగా నటించి రిలయన్స్ కోరిన 4.33 డాలర్ల ధరను 4.2 డాలర్లకు తగ్గించింది. కొండను తవ్వి ఎలుకను పట్టటం అంటే ఇదే!

నాటి రాష్ట్ర ప్రభుత్వ ఆందోళన

ఆలస్యంగానైనా మేల్కొన్న నాటి ఆంధ రాష్ట్ర ప్రభుత్వం కె.జి.బేసిన్ లోని సహజ సంపదలో మన రాష్ట్రానికి న్యాయ సమ్మతమైన వాటా లభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే రిలయన్స్ కంపెనీతో మాట్లాడుకోమంది. ఉన్న నిల్వలు మాకే సరిపోవు కాబట్టి...కొత్తగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్క యూనిట్ సహజ వాయువును కూడా సరఫరా చేయలేనని తేల్చి చెప్పింది. ఫలితంగా మన రాష్ట్రంలో అప్పటికే ప్రైవేట్ రంగంలో నెలకొల్పిన గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పాదన కేంద్రాలకు గ్యాస్ సరఫరా అసాధ్యమైంది. ఈ పరిస్థితులలో నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి కేంద్రానికి కొన్ని సూచనలు చేస్తూ 29 లేఖలు రాశారు. న్యాయబద్ధమైన సూచనలలో ఏ ఒక్కదానిని కూడా కేంద్ర ప్రభుత్వ మంత్రుల కమిటీ పరిగణనలోకి తీసుకొననలేదు. ఈ విధానం హక్కులను నిరాకరించటమే గాక అణిచివేయటం కాదా!

పన్నెండవ ఆర్థిక సంఘం కూడా ఏ ప్రాంతంలో దొరికే సహజ వనరులపైన ఆ ప్రాంతానికి వినియోగ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. పార్లమెంటు స్టాండింగ్ కమిటీ 2013 అక్టోబర్ రిపోర్టులో, సహజ వనరులు ఉత్పత్తి అవుతున్న రాష్ట్రానికి కనీసం 50 శాతం గ్యాస్‌తో పాటు రాయల్టీని కూడా ఇవ్వాలని సిఫారసు చేసింది. సముద్ర అంతర్భాగం నుండి గ్యాస్ తీసినా, భూమి నుండి తీసినా రాష్ట్రానికి వాటా వుండాల్సిందేనని పార్లమెంటు కమిటీ తేల్చిచెప్పింది. మన రాష్ట్రంలో లభ్యమయ్యే సహజ వనరులలో కొంత భాగాన్ని మాత్రమే మన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం డిమాండ్ చేస్తున్న అత్యంత హేతుబద్ధమైన, న్యాయమైన ఈ డిమాండ్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం నిరాకరించటం అంటే ఫెడరలిజాన్ని నిరాకరించటమే, కార్పొరేట్ కంపెనీలకు ప్రత్యక్షంగా వత్తాసు పలకటమే!

కష్టాలు మాకు-సంపద మీకా?

భూమి లోపల కొన్ని లక్షల సంవత్సరాల పరిణామాల ఫలితంగా సహజ వాయువు, చమురు ఏర్పడుతుంది. ప్రజలు సముద్రపు ఆటుపోట్లను, అల్ప పీడనాలను, వాయుగుండాలను, ఉప్పెనలను, సునామీలను, పంట పొలాలలో గ్యాస్ బ్లోఅవుట్లు లాంటి కష్టాలను ఎదుర్కొంటూ జీవిస్తున్నారు. మన గ్రామాల నుండి మన పొలాల నుండి గ్యాస్‌ను పైపుల ద్వారా గుజరాత్‌కు తీసుకెళ్తూ మనకు ఒక్క కేజీ గ్యాస్ కూడా ఇవ్వరట. మన రాష్ట్రంలో లభించే సహజ వనరులను దోచుకుని రిలయన్స్ వంటి బడా కార్పొరేట్ సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటాన్ని, మన ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మనం వ్యతిరేకించాలి. లేనిపక్షంలో మనం భవిష్యత్ తరాల ముందు దోషులుగా నిలబడవలసి వస్తుంది. నిజానికి ఇది ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల బాధ్యత. అయితే ఇప్పటివరకు మన ప్రజా ప్రతినిధులు స్పందించాల్సిన రీతిలో స్పందించని ఫలితంగా ప్రజాఉద్యమాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా రాజీలేని సమైక్య ఉద్యమాన్ని నిర్వహించవలసిన అవసరం నేడు ఏర్పడింది. కె.జి.బేసిన్లో లభించే సహజ వనరులపై మన ప్రాథమిక హక్కును సాధించుకోవటానికి పోరాట దీక్షతో కలసికట్టుగా ముందడుగు వేద్దాం!

/ వ్యాసకర్త సెల్ : 9000657799,
కృష్ణా గోదావరి బేసిన్ చమురు గ్యాస్ సాధన సమితి/

★



1.5 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం

- ఆరుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం, బొడ్డగండి పంచాయితీ పరిధి, మెట్టగూడెం గ్రామంలో ఎకరా 50 సెంట్లు భూమిలో సాగు చేస్తున్న 550 గంజాయి మొక్కలను డొంకరాయి పోలీసులు బుధవారం ధ్వంసం చేశారు. గంజాయి సాగు చేస్తున్న మెట్టగూడెం గ్రామానికి చెందిన వంతల జైసన్, బుదిది సహదేవ్, కొర్రా సోనియా, పాంగి నాగేశ్వరావు, కిలో నగేష్, పీరి అప్పారావులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డొంకరాయి ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ మెట్టగూడెం వద్ద గంజాయి విస్తృతంగా సాగు చేస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు చింతూరు సిఐ గజేంద్ర, వై.రామవరం మండల డిప్యూటీ తహశీల్దారు కె.సుధాకరరావు, వీఆర్ఓ సందీపాచార్యుల సమక్షంలో గంజాయి తోటలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అరెస్టు చేసిన ఆరుగురు నిందితులను రంపచోడవరం జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణాకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజనులు గంజాయి సాగు విరమించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, అందుకు తమ నుంచి ఎప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

చట్టాల్లో మార్పులతో.. భూ హక్కు కోల్పోయే ప్రమాదం

- భూమి సాధించేవరకూ పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాధం



ప్రజాశక్తి-మెంటాడ (విజయనగరం జిల్లా)

ఇటీవల కాలంలో కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం భూ చట్టాలలో తీసుకొచ్చిన మార్పుల వల్ల భూమిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం అన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన బుధవారం 'భూ చట్టాలు..పేదలు.. సిపిఎం వైఖరి'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల దాటినా గిరిజన, దళిత పేద బతుకుల్లో మార్పు రావడం లేదన్నారు. దీనికి ఇప్పటివరకు పాలించిన పాలకులే కారణమన్నారు. రిజర్వ్ ఫారెస్ట్ భూములను ఆదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు వీలుగా చట్టాలు తెచ్చారని, భవిష్యత్తులో పోడు భూమి నుంచి గిరిజనులను దూరం చేస్తారని తెలిపారు. 1/70 చట్టం ప్రకారం డి- పట్టా భూములు పేదలకు దక్కే అవకాశం ఉన్నా రెగ్యులరైజేషన్ పేరుతో భూమిని భూస్వాములు పెత్తందారుల చేతుల్లో పెట్టడానికి జగన్ ప్రభుత్వం చూస్తున్నదని అన్నారు. అన్నింటికీ గ్యారెంటీ ఉందని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ పేదల భవిష్యత్తుకు మాత్రం గ్యారెంటీ ఇవ్వడం లేదన్నారు. కొత్త తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ చట్టం వల్ల మనకున్న మనమే ఆధారాలు తెచ్చుకోవాలని, లేకపోతే హైకోర్టుకు న్యాయ పోరాటానికి వెళ్లాలని అన్నారు. పేదలు హైకోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించారు. పేదలంతా భూముల వదులుకొని పేదరికంలోకి మగ్గాల్సిన పరిస్థితి పాలకులు తీసుకొస్తున్నారని అన్నారు. గిరిజన ప్రాంతమైన ఈ మండలాన్ని షెడ్యూల్ ఏరియాలో చేర్చకుండా గిరిజను లకు భూమి లేకుండా చేశారని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో చేర్చాలని చాలా కాలంగా గిరిజనులు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన మంత్రులు కూడా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వటం లేదని, పట్టాలున్నా భూమి చూపడం లేదన్నారు. కబ్జాకు గురైన భూములను తిరిగి పేదలకు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. నిజంగా పేదల పక్షాన వైఎస్ఆర్ ప్రభుత్వం ఉంటే ఈ క్షణమే ఆక్రమణ భూములపై రిట్ జడ్జితో కమిటీ వేసి, భూముల సర్వే చేసి పేదలకు భూమి దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఉపాధి హామీ పథకాన్ని కూడా ఎత్తివేసే కుట్రకు మోడీ, జగన్ చూస్తున్నారని, నిధులు కేటాయింపులు తగ్గించారని అన్నారు. ఈనేపథ్యంలో భూమి దక్కాలి, బతుకు నిలబడాలి అంటే భూమి సాధించే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఎర్రజెండా అండగా ఉంటుందని తెలిపారు. సిపిఎం మండల నాయకులు తామరాపల్లి సోములు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముందుగా లెనిన్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి లోకనాధం పూలమాల వేసి నివాళులర్పించారు. .

అన్ని జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి చర్యలు

- సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో మార్చి ఐదు నుంచి ఎపి జెన్కో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో విద్యుత్ ఉత్పత్తి అంతరాయం లేకుండా గోదావరి డెల్టా రబీ పంట నీటి అవసరాల మేరకు ఈ నెల 10 నుంచి సీలేరు కాంప్లెక్స్‌లో జల విద్యుత్ కేంద్రాలను విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్లు చెప్పారు. మార్చి ఐదు నుంచి నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు కోరడంతో జల విద్యుత్ కేంద్రాలను విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలైన నీటిని గోదావరి డెల్టాకి విడుదల చేయాలని జెన్కో ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు విలువడ్డాయని పేర్కొన్నారు. ఈ మేరకు పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కులు నీరు విడుదలయ్యేలా మార్చి ఐదు నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం బలిమెల రిజర్వాయర్‌లో ఏపీ వాటా 19.15 టీఎంసీలు, సీలేరు డొంకరాయి జలాశయాల్లో 13.40 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని, ఈ నీటితో రాబోయే మూడు నెలలు విద్యుత్, తాగునీటికి, గోదావరి డెల్టా అవసరాలకు పొదుపుగా వినియోగించుకోవడానికి అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు.

అధిక దిగుబడులు సాధించేలా అవగాహన

- స్మార్ట్ అగ్రికల్చర్ స్కూల్ ప్రారంభోత్సవంలో బొత్స

ప్రజాశక్తి-నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

రైతులు అధిక దిగుబడులు సాధించేలా వారికి అవగాహన కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ స్మార్ట్ అగ్రికల్చర్, రైతు సమ్మేళనం కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స రైతులనుద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో రైతులకు మేలైన పంటల సాగుకు అవసరమైన మెలకువలను నేర్పాలన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డిఎన్ రావు మాట్లాడుతూ తక్కువ రసాయనాలతో పంటలు పండించే విధానంపై రైతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. పర్లాకిమిడిలో మాదిరిగా ఇక్కడ కూడా రైతు సమ్మేళనానికి శ్రీకారం చుట్టామన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులు మేలు రకం పంటలు పండించేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు విశ్వవిద్యాలయంలో అమలు చేస్తోన్న నైపుణ్య కార్యక్రమాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, స్టాళ్లను మంత్రి బొత్స సత్యనారాయణ తిలకించారు. కృషి జాగ్రన్ సహకారంతో స్మార్ట్ అగ్రికల్చర్ స్కూల్, రైతు సమ్మేళనం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి. సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఐపిఎల్ మ్యాచ్ ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి -పిఎం పాలెం

వైజాగ్ వేదికగా రెండు ఐపిఎల్ మ్యాచ్‌లు ఖరారు కావడంతో, వాటి నిర్వహణ, వసతులు తదితర ఏర్పాట్లపై ఢిల్లీ క్యాపిటల్స్ ఆపరేషన్స్ టీమ్ సభ్యులు బుధవారం ఎసిఎకార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డిని కలిసి చర్చించారు. అనంతరం పీఎం పాలెం ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. మార్చి 31న చెన్నయ్‌తో, ఏప్రిల్ 3న కొల్‌కత్తాతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఇక్కడ మ్యాచ్‌లు ఆడనుంది. ఎసిఎ సిఇఒ డాక్టర్ ఎంవి.శివారెడ్డి, సిఎఫ్ఒ ఎం.నవీన్ కుమార్, గేమ్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఎంఎస్.కుమార్ పాల్గొన్నారు.

బీజాపూర్ ఆసుపత్రిలో మావోయిస్టుల మృతదేహాలు

ప్రజాశక్తి -సీలేరు

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బంగ్లా పోలీసు స్టేషన్ పరిధి చోటే తుంగలీ అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన నలుగురు మావోయిస్టులను పోలీసులు గుర్తించారు. ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ ప్లాటిన్ కమాండర్ ప్రేక్షత్ మాత్వాడ, ఎల్ఓఎస్ కమాండర్ అనిల్ పూణేం, బైరాంఘడ్ ఏరియా జనతా సర్కార్ అధ్యక్షులు రాజేష్, మరో మావోయిస్టు మృతదేహాలకు బీజాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, భద్రపర్చారు. ఏడు రోజులు వరకు మృతదేహాలను ఆసుపత్రిలో ఉంచుతామని, ఈ లోగా వారి బంధువులు వస్తే వారికి అప్పగిస్తామని, ఎవరు రాకుంటే తామే అంత్యక్రియలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

అటకెక్కిన ఆధునికీకరణ

- వంశధార మోడరనైజేషన్‌పై అదే నిర్లక్ష్యం
- నష్టపోతున్న ఆయుకట్టు రైతాంగం

సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలో కాలువ దుస్థితి (ఫైల్ ఫోటో)



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రాజెక్టులను పూర్తి చేస్తామంటూ ప్రతిపక్షంగా హామీ ఇస్తున్న పార్టీలు ఆనక అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసెత్తడం లేదు. దీంతో ఆ ప్రాజెక్టుల పనుల ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అటువంటి ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టుల్లో వంశధార ఆధునికీకరణ పనులు ముఖ్యమైనవి. పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి మోడర్‌నైజేషన్ పనులు గురయ్యాయి. అప్పుడెప్పుడో నిర్మించిన కాలువలను పటిష్టం చేసేందుకు ఉద్దేశించిన ఆధునికీకరణ పనులను విస్మరించడంతో శివారు భూములకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నా పాలకులకు పట్టడం లేదు. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండటంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు ఉంటున్నా సామర్థ్యం మేరకు నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కొన్నిచోట్ల గండిపడిన ఘటనలూ చోటు చేసుకున్నాయి.

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచి పెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువలు నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండటంలో అంతకుమించి నీటిని వదిలితే గండికొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరమూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. ఎడమ కాలువను ఆధునికీరించాల్సిన అవసరముందంటూ గత తొమ్మిదేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతునే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి తర్వాత మొదటి సారి 2016లో రూ.456 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చివరి సారిగా 2018లో రూ.624 కోట్లతో పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 లో మొదటిసారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2023 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

రెండు పర్యాయాలు కోతకు గురయైన గట్లు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. 2023 అక్టోబరులో వంశధారలో 80 వేల క్యూసెక్కు వరదనీరు ప్రవాహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపుల గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి 2022 జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దానినీ రూ.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెట్టారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది. తొమ్మిదేళ్లుగా నిరక్ష్యం చేసిన పాలకలు ఎన్నికలు వస్తుండటంతో టిడిపి, వైసిపిలు మరోసారి సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ప్రచారస్త్రంగా వినియోగించుకోవాలని చూస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ఒక అజెండా మార్చి అవి పూర్తయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలు, రైతులపై ఉంది.

జెఎన్‌టియులో జాతీయ సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విజయనగరం ప్రాంగణంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో సాంకేతిక సింపోజియం ఘనంగా బుధవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ కె.వి వెంకట సుబ్బయ్య పాల్గొని మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడం ద్వారా భవిష్యత్‌లో మన అభివృద్ధితో పాటూ దేశాభివృద్ధి సాధ్యపడుతుందని పేరొన్నారు. ఈడియక్స్ వంటి ఆన్‌లైన్ కోర్సుల ద్వారా సిలబస్ దాటి వివిధ అదనపు పాఠ్యాంశాలకు సంబంధించిన జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. దీనికి సంబంధించి యూనివర్శిటీ తరుపున ఆయన పూర్తి సహాయసహకారాలను అందిస్తామన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సాంఖ్యా టెక్నాలజి సిఇఒ గోపి కుమార్ బులుసు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు పెద్ద సంఖ్యల్లో రోజువారి సమస్యలను పరిష్కరిస్తాయని అన్నారు.



సెమినార్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విసి కెవి.వెంకటసుబ్బయ్య

ఈ సంధర్భంగా సాంఖ్య టెక్నాలజీస్ రూపొందించిన డిజిటల్ బ్యాగ్‌ను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఇసిఇ డిపార్టుమెంట్ హెడ్ బి.నలిని, తదితరులు పాల్గొన్నారు.

'ఓట్ల'కు తాయిలాలు..!

- కోడ్...కూయకముందే ప్రలోభాలు
- 'పురం'లో మహిళలకు చీరల పంపిణీ చేస్తున్న ప్రధానపార్టీలు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు రెండు ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలకు తెరలేపారు. ఎన్నికల్లో గెలుపునకు మహిళా ఓట్లే కీలకం కావాడంతో వారిని ప్రసన్నం చేసుకోవాడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా హిందూపురంలో గడప గడపకూ వైసిపి కార్యక్రమం పేరుతో వైసిపి నాయకులు కరపత్రంతో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారు. తామేమి తక్కువ కాదని రంగంలోకి దిగిన టిడిపి నాయకులు మహా శివరాత్రి పండుగ పేరుతో బాలకృష్ణ, వసుంధర ఫోటోలతో కూడిన క్యాలెండర్, చీరలను పంపిణీ చేస్తున్నారు. ఇలా రెండు పార్టీలు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే తాయిలాల పంపిణీకి తెరలేపారు. ఈ పంపిణీ కార్యక్రమం నోటిఫికేషన్ వచ్చే లోపే పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత మరింత పెద్ద ఎత్తున పంపిణీలకు ఇరు పార్టీల వారు రంగం సిద్ధం చేస్తున్నారు. ఓటుకు రూ.2000 అంతకంటే ఎక్కువ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇరు పార్టీలు భారీగా నగదును క్షేత్ర స్థాయి వరకు ఇప్పటికే చేర్చినట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. దీనికి అదనంగా మందు సీసాల డంప్‌లను గ్రామీణ ప్రాంతాల్లో రహస్యంగా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. టిడిపి ఆవిర్భావం నుంచి హిందూపురంలో ఓటమి ఎరుగని కోటపై ఈ సారి వైసిపి జెండా ఎగరవేయాలని ఏకంగా వైసిపి పార్టీ రాయలసీమ కో-ఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే రంగంలోకి దిగి గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణం వరకు క్షేత్ర స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలతో నేరుగ మాట్లాడి పార్టీ గెలుపునకు ఎలా పని చేయాలనే దానిపై దిశానిర్ధేశం చేశారు. ఇక టిడిపి సైతం గెలుపు కోసం అన్ని అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తోంది. నందమూరి బాలకృష్ణ హిందూపురం నుంచి మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించాలనే కృతనిశ్చయంతో ఉన్నారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను ఏర్పాటు చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు అందరితో సెల్ఫీలు దిగుతూ ప్రజల మనసు గెలిచే ప్రయత్నం చేస్తున్నారు. బాలకృష్ణతో పాటు ఆయన భార్య వసుంధర సంక్రాంతి ముగ్గుల పోటీల పేరుతో మహిళా ఓటర్లను ఆకర్షించారు. ఇలా హిందూపురం నియోజకవర్గంలో టిడిపి, వైసిపి ఎవరికి వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఈ పంపిణీలపై ఎన్నికల సంఘం స్పందించకుంటే ప్రజాస్వామ్యం అపహాస్యం అయ్యి ఓటుకు విలువ లేకుండా పోతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

'శ్రీకృష్ణదేవరాయ'కు ఐసిఎఆర్ గుర్తింపు

ప్రజాశక్తి -అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ కళాశాలకు భారత పరిశోధన వ్యవసాయమండలి (ఐసిఎఆర్) గుర్తింపు నిచ్చింది. అయిదేళ్ల వరకు అక్రెడిటేషన్ ఉంటుందని బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో పల్లె సింధూర పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్టు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

నరసాపురం తీరప్రాంతంలో మత్స్య ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఫిషింగ్ హార్బర్, కార్గోపోర్టు నిర్మాణం దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. చినమైనవానిలంకలో రూ.430 కోట్లతో నిర్మించే ఫిషింగ్ హార్బర్ కార్గో పోర్టు నిర్మాణం పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ఎనిమిది ఫిషింగ్ హార్బర్ కార్గో పోర్టు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉందని తెలిపారు. చినమైనవానిలంకలో 120 ఎకరాల్లో నిర్మించే ఈ కార్గో పోర్టు నిర్మాణం పనులకు కేంద్ర ప్రభుత్వం నుండి పర్యావరణం, సాంకేతిక అనుమతులు లభించాయన్నారు. శిథిలమైన నల్లి క్రీక్ వంతెన నిర్మాణ పనులు రూ1.50 కోట్లతో వేగవంతంగా చేపడుతున్నామన్నారు. బియ్యపుతిప్పలో రూ.10 కోట్లతో ఫిషింగ్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఎఎంసి చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను విడుదలచేస్తున్న పిఎస్ఆర్ చౌదరి

నేటి నుంచి వైర్‌లెస్ పై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఇఇఇ) సౌజన్యంతో రఘు విద్యాసంస్థల ఆధ్వర్యాన ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేదీ వరకు 3వ వైర్‌లెస్, యాంటినా మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్-2024) నిర్వహిస్తున్నట్లు సదస్సు జనరల్ చైర్ డాక్టర్ పిఎస్ఆర్ చౌదరి తెలిపారు. విశాఖలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. సదస్సుకు జెఎన్‌టియు విజయనగరం ఉపకులపతి ఆచార్య కె వెంకటసుబ్బయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. వర్తమాన పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలపై నిపుణులు ప్రసంగాలు ఉంటాయన్నారు. నూతన జ్ఞానాన్ని బదలాయింపు, పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని వివరించారు. సదస్సులో భాగంగా టెక్నికల్ సెషన్స్, కీలకోపన్యాసాలు, వర్క్‌షాప్‌లు, ప్రత్యేక సెషన్స్, స్టూడెంట్ పేపర్స్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్లీనరీ సెషన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో భాగంగా ఐఇఇఇ యంగ్ ప్రొఫెషనల్స్, విమెన్ ఇన్ ఇంజనీరింగ్, ఐఇఇఇ స్టూడెంట్ యాక్టివిటీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రావ్ ఎస్ కన్సల్టెంట్స్ (అమెరికా) నిర్వాహకులు డాక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ సదస్సులో 200 పరిశోధన పత్రాలను 300 మంది ప్రతినిధులు సమర్పిస్తారని తెలిపారు. 43 అవార్డులను అందిస్తామన్నారు. నాసా జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ (అమెరికా) నిపుణుడు డాక్టర్ నాసిర్ చాహత్ మాట్లాడుతూ టెక్నాలజీ రంగంలో విద్యార్థులను ముందుంచే దిశగా నిపుణులు స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ పావులో ఫోకార్డి, డాక్టర్ గౌరంగి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అఖిలేష్‌కి సిబిఐ సమన్లు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో..ప్రతిపక్షాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎడాపెడా దాడులకు దిగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎనిమిది సార్లు సమన్లు జారీ చేసింది. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ని కూడా అవినీతి ఆరోపణలపై అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అక్రమ మైనింగ్ కేసులో సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) బుధవారం సమన్లు జారీ చేసింది. సాక్షిగా విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. గురువారం దర్యాప్తు సంస్థ ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అఖిలేశ్ యాదవ్ 2012 నుంచి జూన్, 2013 మధ్య మైనింగ్ శాఖను నిర్వహించాడు.

ఉత్తరప్రదేశ్‌లోని ఏడు జిల్లాలు, షామ్లీ, కౌశాంబి, ఫతేపూర్, డియోరియా, సహరాన్‌పూర్, హమీర్‌పూర్ , సిద్ధార్థనగర్ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. 2012 నుంచి 2016 మధ్య కాలంలో నిబంధనలను పాటించకుండా ప్రభుత్వ అధికారులు కొన్ని అక్రమ మైనింగ్ స్థలాలను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలను ఉల్లంఘించి మైనింగ్ హక్కులు కూడా ఇచ్చారని సిబిఐ పేర్కొంది.

రబ్రీ, ఆమె కుమార్తెలకు బెయిలు

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్ కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవికి, ఆమె కుమార్తెలు మిసా భారతి, హేమా యాదవ్‌లకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు బుధవారం నాడు బెయిల్ మంజూరు చేసింది. ఈ ముగ్గురూ దాఖలు చేసుకున్న బెయిల్ దరఖాస్తుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడంతో వారికి ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గాగ్నే బెయిల్ మంజూరు చేశారు. లక్ష రూపాయల బాండ్, అంతే మొత్తానికి షుర్యిటీ బాండ్ మీద బెయిల్ మంజూరు చేశారు. ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిల పెద్ద కుమార్తె అయిన మిసా భారతి ప్రస్తుతం బీహార్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్నారు.

కేసు తీవ్రత దృష్ట్యా నిందితులకు బెయిలు మంజూరు చేసేముందు కఠిన షరతులు విధించాలని కోర్టును ఇడి బుధవారంనాడు కోరింది. దీనికి ముందు గత ఫిబ్రవరి 9న వీరి బెయిలు దరఖాస్తు విచారణకు వచ్చింది. రెగ్యులర్ బెయిల్ అప్లికేషన్‌పై అడ్వాన్స్ ఆర్గుమెంట్లకు సమయం కావాలని ఇడి కోరడంతో న్యాయమూర్తి ఈ ముగ్గురికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. రెగ్యులర్ బెయిల్ కోసం రబ్రీదేవి, ఆమె ఇద్దరు కుమార్తెలు బుధవారంనాడు కోర్టు ముందు హాజరయ్యారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత.. భద్రతా బలగాల మోహరింపు

ఇంఫాల్ : మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ఇంఫాల్ ఈస్ట్ ప్రాంతంలో అస్సాం రైఫిల్స్‌ను మోహరించారు. మొయితీ గ్రూపునకు చెందిన వ్యక్తులు ఒక సీనియర్ పోలీసు అధికారిని కిడ్నాప్ చేశారని అధికారులు తెలిపారు. స్పందించిన పోలీసు, సెక్యూర్టీ బలగాలు తక్షణమే స్పందించి అదనపు ఎస్‌పి అమిత్ కుమార్‌ను రక్షించాయని అన్నారు. ప్రస్తుతం ఆయనను ఆస్పత్రిలో చేర్పించామని, ఆయన పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈ కిడ్నాప్ జరిగింది. ఇంపాల్ ఈస్ట్‌లోని వాంగ్‌ఖేయ్‌లో ఉన్న అమిత్ కుమార్ నివాసంపై మొయితీ కమ్యూనిటీ అటాక్ చేసినట్లు తెలుస్తోంది. ఆయన నివాసాన్ని దోచుకోవడంతో పాటు సుమారు నాలుగు వాహనాలను ధ్వంసం చేశారని వారు అన్నారు. వాహనచోరీకి పాల్పడ్డారంటూ మొయితీ కమ్యూనిటీకి చెందిన ఆరుగురు సభ్యులను అమిత్‌కుమార్ అరెస్ట్ చేశారు. వారిని విడుదల చేయాలంటూ మీరా పైబీస్ (మొయితి మహిళా బృందం) నిరసన వ్యక్తం చేసింది. రోడ్లను దిగ్బంధించింది.

తమిళనాడు మాజీ మంత్రి బాలాజీకి బెయిల్ నిరాకరణ

చెన్నై : తమిళనాడు మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీకి బెయిల్‌ను మద్రాసు హైకోర్టు బుధవారం తిరస్కరించింది. మనీలాండరింగ్ కేసులో ఎన్‌పోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గతేడాది జూన్‌లో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుండి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. జస్టిస్ ఎన్. ఆనందర్ వెంకటేష్ సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. పిటిషనర్ 250 రోజులకి పైగా జైలులో ఉన్నందున .. ఆచరణలో సాధ్యమైనంత వరకు రోజువారీ ప్రాతిపదికన విచారణను నిర్వహించి మూడునెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించారు.

జార్ఖండ్‌లో ఘోరం

- ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని

ముగ్గురు మృతి

రాంచీ: జార్ఖండ్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం రైల్వే ట్రాక్ దాటుతున్న కొందరిని బెంగళూరు -భాగల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురి మృత దేహాలను వెలికి తీశారు. ప్రమాదం జరిగిన చోట చీకటిగా ఉండటంతో.. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని, మృతుల సంఖ్య పెరగొచ్చని అధికారులు తెలిపారు. అనసోల్ పరిధి జంతారా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్రమత్తమైన సిబ్బంది ఘటనాస్థలానికి వైద్య బృందాలను, అంబులెన్స్‌లను తరలించారు. పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రసూతి సెలవుల్లో వివక్ష తగదు

- రెగ్యులర్, కాంట్రాక్టు ఎవరైనా ఒకటే
- కలకత్తా హైకోర్టు స్పష్టీకరణ



కోల్‌కతా : ప్రసవం ,ప్రూతీ శలవుకు సంబంధించి ఒక మహిళకు గల హక్కుపై రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల మధ్య ఎలాంటి తేడా వుండరాదని కోల్‌కతా హైకోర్టు స్పష్టం చేసింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ)లో ఎగ్జిక్యూటివ్ ఇంటర్న్‌గా 2011 ఆగస్టు 16 నుండి మూడేళ్ళ కాలానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న పిటిషనర్ ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించారు. వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి శలవును అనుమతించడంలో ఆర్‌బిఐ విఫలమవడాన్ని ఆమె ప్రశ్నించారు.

ఈ కేసులో జస్టిస్ రాజా బసు చౌదరి సోమవారం తీర్పునిస్తూ పై విషయం స్పష్టం చేశారు. ప్రసవించడానికి, ప్రసూతి శలవకు మహిళకుండే హక్కు విషయంలో బేధం చూపడానికి అనుమతించబడదని చెప్పారు. తక్షణమే పిటిషనర్‌కి నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా బ్యాంక్‌ను కోర్టు ఆదేశించింది. ఏ శలవు కాలాన్ని అయితే తిరస్కరించారో అదే కాలానికి ఆమెకు వేతనంతోకూడిన శలవును ఇవ్వాలని చెప్పింది. మాస్టర్ సర్క్యులర్ ప్రకారం తమ మహిళా ఉద్యోగులకు ప్రసూతి ప్రయోజనాలను ఆర్‌బిఐ సాధారణంగా అందచేస్తూ వుంటుందని, అలాంటి ప్రయోజనాలను ఇక్కడ పిటిషనర్‌కు వర్తింప చేయలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఒక వర్గం పరిధిలో మరొక వర్గాన్ని సృష్టించేందుకు తీసుకున్న ఇది వివక్షాపూరితమైన చర్యే అని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. ఇది భారత రాజ్యాంగంలోని 14వ అధికరణను ఉల్లంఘిస్తోందని కోర్టు పేర్కొంది. ప్రసూతీ ప్రయోజనాల చట్టం, 1961 అర్ధం పరిధిలో ఇది వివక్ష ప్రదర్శించే చర్యే కాకుండా నేరం కూడానని స్పష్టం చేసింది.చట్టంలోని 5(1) క్లాజు ప్రకారం ప్రతి మహిళ ప్రసూతి ప్రయోజనాల చెల్లింపునకు అర్హులాలని ఆమెకు ఉద్యోగమిచ్చిన యజమాని చెల్లించాల్సిందేనని పేర్కొంది. 2012 నవంబరు 30వ తేది రాసిన లేఖలో ఆమె ఆరు మాసాల పాటు ప్రసూతి శలవుకు దరఖాస్తు చేసుకుంది. డిసెంబరు 3 నుండి అమల్లోకి వచ్చేలా ఈ శలవు ఇవ్వాల్సిందిగా కోరింది. ఆమెకు బెడ్ రెస్ట్ కావాలని డాక్టర్లు సూచించారు. 2013 జనవరి మొదటి అర్ధభాగంలో ఆమె ప్రసవ తేదీ వుంటుందని సూచించారు. ఆ సమయంలో పిటిషనర్ దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు ఎలాంటి సమాచారం లేకపోగా కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఆమెకు ప్రసూతి శలవు రాదని అదే ఏడాది మార్చి 14వ తేదీ లేఖలో తెలియచేశారు. ఆమె విదులకు హాజరు కాకపోవడాన్ని నష్టపరిహారం లేని శలవుగా వ్యవహరిస్తామని కూడా తెలియచేశారు. బ్యాంక్‌లో జూనియర్ మోస్ట్ ఆఫీసర్లకు వర్తించే మెడికల్ ప్రయోజనాలు ఆమెకు అందుతాయని తెలిపారు.

అయితే ఉద్యోగ కాంట్రాక్టు ఒప్పందం ప్రసూతి ప్రయోజనాల చట్టంపై ఎలాంటి ప్రభావాన్ని చూపదంటూ పిటిషనర్ తరపు న్యాయవాది మాలిని చక్రవర్తి వాదించారు. దీన్ని వ్యతిరేకిస్తూ, ఆమె కాంట్రాక్టులోనే నిబంధనలన్నీ వున్నాయని, అవన్నీ తెలిసే పిటిషనర్ సంతకం చేశారని, కనుక ఆమెకు ఈ ప్రయోజనాలు వర్తించబోవని బ్యాంక్ తరపు న్యాయవాది వాదించారు.

2029లో జమిలి ఎన్నికలకు

లా ప్యానెల్ ప్రతిపాదన..?

- శాసన సభల నిబంధనలను "మూడు దశల్లో" మార్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యాంగంలో 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే అంశంపై కొత్త అధ్యాయాన్ని జోడించి, 2029 నాటికి దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలని లా కమిషన్ సిఫారసు చేసినట్లు వార్తలొస్తున్నాయి. జస్టిస్ (రిటైర్డ్) రీతు రాజ్ అవస్తీ ఆధ్వర్యంలోని కమిషన్, ఏకకాల ఎన్నికలపై "కొత్త అధ్యాయం, భాగాన్ని" జోడించడానికి రాజ్యాంగంలో సవరణను సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. 19వ లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న 2029 మే-జూన్‌లో మొదటి 'జమిలి' ఎన్నికలను నిర్వహించేందుకు వీలుగా వచ్చే ఐదేళ్లలో శాసన సభల నిబంధనలను "మూడు దశల్లో" సమకాలీకరించాలని కూడా ప్యానెల్ సిఫారసు చేస్తోందని సమాచారం. లా కమిషన్‌తో పాటు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి కమిటీ కూడా రాజ్యాంగాన్ని, ప్రస్తుత చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను మార్చడంతో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, మునిసిపాలిటీలు, పంచాయతీలకు ఏకకాలంలో ఎన్నికలు ఎలా నిర్వహించవచ్చనే దానిపై నివేదికను రూపొందిస్తోంది.

ఈ ఏడాది ఏప్రిల్-మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలతో పాటు, కనీసం ఐదు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. మహారాష్ట్ర, హర్యానా, జార?ండ్ రాష్ట్రాలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది బీహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ 2026లోనూ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్‌లకు 2027లో ఎన్నికలు జరగనున్నాయి. 2028లో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్, కర్ణాటక, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ వంటి తొమ్మిది రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చు.

ఢిల్లీ సోలార్ పాలసీకి మోకాలడ్డిన లెఫ్టినెంట్ గవర్నర్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గత నెలలో ప్రకటించిన సోలార్ పాలసీ 2024 లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా బుధవారం అడ్డుకున్నారు. దీనిపై ఆప్ ఎంపి సందీప్ పాఠక్ మాట్లాడుతూ, బిజెపి తన కోపాన్ని కేజ్రీవాల్‌పైనే కాకుండా ఢిల్లీ ప్రజలపై కూడా చూపుతోందని విమర్శించారు.. సోలార్ పాలసీ అత్యంత ప్రగతిశీలమైన, అధునాతన పాలసీ అని అన్నారు. ఈ పథకాన్ని కేవలం ఢిల్లీలో మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ అమలు చేయాలని సూచించారు. దేశాన్ని పక్కన పెట్టండి.. కనీసం ఢిల్లీలోనైనా అమలు చేయనీయకుండా బిజెపి అడ్డుకుందని మండిపడ్డారు. ప్రతి విషయంలోనూ అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. వారి ఆగ్రహం కేవలం కేజ్రీవాల్‌పై మాత్రమే కాదు.. ఢిల్లీ, ఢిల్లీ ప్రజలపై కూడా అని అన్నారు. దేశ పురోభివద్ధి బిజెపి లక్ష్యం కాదని, వారు కేవలం 'డర్టీ పాలిటిక్స్'కి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

ఢిల్లీలో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ స్థాపన లక్ష్యంతో రాష్ట్ర సోలార్ పాలసీ 2016కి సవరణలు చేస్తూ.. ఆప్ ప్రభుత్వం జనవరి 29న సోలార్ పాలసీ 2024ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2027 నాటికి 4,500 మెగావాట్ల సౌర విద్యుత్‌ను స్థాపించడమే లక్ష్యమని పేర్కొంది. ఈ పథకంతో ఢిల్లీ ప్రజలకు 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా (పూర్తిగా సబ్సిడీ) కల్పిస్తుంది. నెలకు 201 నుండి 400 యూనిట్లు వినియోగించే గృహ వినియోగదారలకు 50 శాతం సబ్సిడీ కల్పిస్తోంది. 400 యూనిట్లు దాటితే సబ్సిడీ ఉండదు.

క్షామానికి అడుగు దూరంలో 5,76,000మంది

- గాజాలో పరిస్థితులపై ఐరాస హెచ్చరిక
- ఆహారం కోసం బారులుతీరినవారిపై విచక్షణారహితంగా కాల్పులు



న్యూయార్క్, గాజా : సైన్యం విచక్షణారహితంగా జరిపే యుద్ధంతో దిక్కుతోచని స్థితిలో వున్న పాలస్తీనియన్లకు సహాయం అందకుండా ఒక పద్ధతి ప్రకారం అడ్డుకుంటోందంటూ ఐక్యరాజ్య సమితి అధికారి ఇజ్రాయిల్‌ను విమర్శించారు. గాజాలో నాలుగో వంతు జనాభా అంటే దాదాపు 5,76,000 మంది కరువు కాటకాలకు కేవలం ఒక్క అడుగు దూరంలో వున్నారని హెచ్చరించారు. ఐక్యరాజ్య సమితి మానవతా సంస్థ (ఒసిహెచ్ఎ) డిప్యూటీ చీఫ్ రమేష్ రాజసింగమ్ భద్రతామండలిలో మాట్లాడుతూ ఈ హెచ్చరిక చేశారు. రెండేళ్ళలోపు పిల్లల్లో ప్రతి ఆరుగురిలో ఒకరు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వయస్సుకు తగిన ఎదుగుదల వారిలో లేకుండా పోతోందన్నారు. వాస్తవానికి గాజాలోని 23లక్షల మంది ప్రజలకు బతకడానికి సరిపడా ఆహారం లేదని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి అత్యవసరంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, గాజాలో విస్తృత స్థాయిలో క్షామం అనివార్యమవుతుందని, మరింతమంది బాధితులను బలి తీసుకుంటారని ఆయన హెచ్చరించారు.

గాజాలోకి కనీస స్థాయిలో ఆహార సరఫరాలను అందించేందుకు గానూ సహాయ గ్రూపులు తీవ్ర అడ్డంకులను, అవరోధాలను ఎదుర్కొంటున్నాయని రాజసింగమ్ చెప్పారు. క్రాసింగ్‌లు మూసివేయడం, కదలికలపై, కమ్యూనికేషన్‌పై ఆంక్షలు విధించడం, సుదీర్ఘ ప్రక్రియలు, అశాంతి, దెబ్బతిన్న రహదారులు, పేలకుండా వుండిపోయిన పేలుడు పదార్ధాలు వంటివి కారణాలుగా చెప్పారు.

ఉత్తర గాజాలో ఆహారం కోసం క్యూలు కట్టి నిలుచున్న ప్రజలపై ఇజ్రాయిల్ బలగాలు మళ్లీ కాల్పులు ప్రారంభించిన వీడియో బయటకు వచ్చిన నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి హెచ్చరికలు వెలువడ్డాయి. అయితే ఈ కాల్పుల్లో ఎవరైనా మరణించారా లేదా గాయపడ్డారా లేదా అనేది తెలియరాలేదు. ఐదో నెల్లోకి అడుగిడిన ఈ యుద్ధంలో ఇప్పటివరకు 29,878మంది పాలస్తీనియన్లు చనిపోయారు.

గాజాకు సాయమందించడం దాదాపు అసాధ్యమై పోతోందని జెనీవాలో ఒసిహెచ్ఎ మరో ప్రతినిధి జేన్స్ లార్కె వ్యాఖ్యానించారు. సహాయం తీసుకువచ్చే బృందాలపై తరచుగా దాడులకు తెగబడుతున్నారని, సాయమందించే కార్యకర్తలు, వర్కర్లపై వేధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇదిలావుండగా, కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వస్తే సాయాన్ని మరింత విస్తరిస్తామని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) ప్రకటించింది. 15వేల మెట్రిక్ టన్నుల ఆహారం తీసుకుని వస్తున్న దాదాపు వెయ్యి ట్రక్కులు ఈజిప్ట్‌లో కదలడానికి సిద్ధంగా వున్నాయన్నారు.



హిమాచల్‌లో బెడిసికొట్టిన ఆపరేషన్ కమల్

- పశ్చాత్తాపం వ్యక్తం చేసిన 'క్రాస్-ఓటింగ్' ఎమ్మెల్యేలు
- ప్రభుత్వానికి ఢోకా లేదన్న సిఎం సుఖ్వీందర్ సింగ్

షిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపి నిర్వహించా లను కున్న ఆపరేషన్ కమలం బెడిసి కొట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి వేయాలనే బిజెపి కుట్రలు ఫలించలేదు. మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి క్రాస్ ఓటింగ్ చేసిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మళ్లీ సొంతగూటికే చేరుకున్నారు. బిజెపి అభ్యర్థికి ఓటు వేయడంపై పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేశారు. ఈ విషయాన్నిముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుకు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యేలు క్షమించమని కూడా చెప్పారని తెలిపారు. బిజెపి చేస్తున్న ఏ కుట్రలూ ఫలించవని.. ఐదేళ్లు పూర్తయ్యేవరకు రాష్ట్రంలో తమ కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. అలాగే, సీఎం పదవికి తాను రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలపైనా స్పందించారు. "కాంగ్రెస్ అధిష్ఠానం నన్నుగానీ, మరెవరినీ గానీ రాజీనామా చేయమని కోరలేదు. అలాంటిదేమీ జరగలేదు. ఇదంతా ఇక్కడి బిజెపి నేతలు చేస్తున్న పనే. వారికి సొంత మనుషులపై నమ్మకం లేదు. సిఆర్‌పిఎఫ్, హర్యానా పోలీసుల్ని మోహరించారు. హెలికాప్టర్ కూడా వినియోగించారు" అని అన్నారు. "ఒక్క విషయం మాత్రం చెప్పదలచుకున్నా.. హిమాచల్ ప్రదేశ్ ప్రజలు, ఎమ్మెల్యేలు మావెంటే ఉన్నారు.. ఐదేళ్ల పాటు మా ప్రభుత్వాన్ని కొనసాగించగలమని కచ్చితంగా చెప్పగలను" అని అన్నారు. ప్రజల తీర్పుపై దాడిని తాము అనుమతించబోమన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి మంగళవారం ఎన్నిక జరగ్గా ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ వల్ల అక్కడ బిజెపి అభ్యర్థి విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయిందని బిజెపి నాయకులు విమర్శించారు. ముఖ్యమంత్రి రాజీనామాకు డిమాండ్ చేశారు.

కాగా, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ బుధవారం బడ్జెట్‌ను ఆమోదించింది. తరువాత స్పీకర్ అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేశారు.

బలపడుతున్న 'ఇండియా'

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి బలహీనపడుతుందని, 'ఇండియా' వేదిక బలపడుతోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. బీహార్‌లో నితీష్ కుమార్ పోయినా ఇండియా వేదిక బలోపేతం అవుతుందని, బిజెపి వ్యతిరేకంగా తమ పోరాటం ఉంటుందని అన్నారు. కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే పోటీ చేస్తాయని, కేంద్రంలో బిజెపి రాకూడదన్నదే తమ వైఖరి అని అన్నారు. ప్రజా సమస్యలు మోడీకి పట్టడం లేదని, రైతులు ఆందోళనలో ఉంటే జంతువులను వేటాడినట్లు వారిని వేటాడుతున్నారని ఆయన విమర్శించారు. అన్నదాతలపై యుద్ధం సరికాదన్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అసలు నిందితులను వదిలి కేజ్రీవాల్ టీంను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఎపి ముఖ్యమంత్రి జగన్ ఎప్పుడో కేంద్రానికి లొంగిపోయాడని, రూ.45 వేల కోట్లు దోచి, 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, అయినా ఆయనపై చర్యలు లేవని అన్నారు. పిరికిపంద రాజకీయాలు చేసేవారు రాజకీయాల్లో ఉండటం సరికాదని అన్నారు. విభజన హామీలు అమలు చేయకపోయినా, బిజెపి కాళ్ళు పట్టుకోవడం దారుణమన్నారు.

మిచిగన్ ప్రైమరీలో

బైడెన్, ట్రంప్‌లు విజయం

- వచ్చే మంగళవారం మరో 21 రాష్ట్రాల్లో ప్రైమరీలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లిరువురూ మంగళవారం మిచిగన్ ప్రైమరీలో వారి వారి పార్టీల తరపున విజయం సాధించారు. ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే దిశగా ఇరువురు ముందుకు సాగుతున్నారు. ప్రధాన ప్రత్యర్థి, ఇండియన్ అమెరికన్ నిక్కీ హేలీని ట్రంప్ అతి సునాయాసంగా ఓడించారు. తద్వారా రిపబ్లికన్ పార్టీ నామినేషన్‌ను పొందడానికి మరో అడుగు ముందుకేశారు.

కడపటి వార్తలందేసరికి, నిక్కీ హేలీకి 28.9శాతం ఓట్లు రాగా, ట్రంప్‌కు 66.4శాతం ఓట్లు లభించాయి. 40శాతం పైగా ఓట్లతో మిచిగన్ ప్రైమరీని ట్రంప్ కైవసం చేసుకుంటారని న్యూయార్క్ టైమ్స్ ముందుగానే అంచనా వేసింది. తనను గెలిపించిన మిచిగన్ ఓటర్లకు బైడెన్ కృతజ్ఞతలు తెలియచేశారు. మిచిగన్ ప్రైమరీలో ముఖ్యమైన అంశం ఏమంటే అక్కడ ముస్లిం జనాభా గణనీయంగా వున్నారు. ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధాన్ని నివారించడంలో బైడెన్ సరిగా వ్యవహరించలేదని వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో బైడెన్ దాదాపు 20శాతం ఓట్లు కోల్పోయారు. మిచిగన్‌లో ఏం జరిగిందో అదే దేశవ్యాప్తంగా కొనసాగేందుకు అవకాశాలు వున్నాయనడానికి ఇదొక హెచ్చరిక వంటిదని పార్టీ జాతీయ ప్రతినిధి అలీవియా పెరెజ్ వ్యాఖ్యానించారు. వచ్చే మంగళవారం 21 రాష్ట్రాల్లో ప్రైమరీలు జరగనున్నాయి. ప్రస్తుత ధోరణిని చూస్తుంటే మార్చి 2కల్లా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా ట్రంప్ ఆవిర్భవించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి.

జపాన్‌లో జననాల సంక్షోభం

- గతేడాది రికార్డు స్థాయిలో పతనం
- వివాహం, కుటుంబం వంటి అంశాలపై దృష్టి పెట్టని యువత

టోక్యో : గతేడాది జపాన్‌లో జననాల సంఖ్య బాగా పడిపోయింది. వరుసగా ఎనిమిదేళ్ళుగా తగ్గుతూ వస్తున్న జననాలు ఈసారి రికార్డు స్థాయిలో పడిపోయాయి. రాబోయే ఆరేళ్లలో ఈ ధోరణిని మార్చకపోతే జపాన్ మనుగడే ప్రమాదంలో పడుతుందని ఉన్నతాధికారి ఒకరు అన్నారు.. 2023లో 7,58,631మంది శిశువులు జన్మించారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే గతేడాది 5.1శాతం మేరా జననాల సంఖ్య క్షీణించిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. 1899 నుండి జననాలు, మరణాల గణాంకాలను నమోదు చేయడం ఆరంభించినప్పటి నుండి అత్యంత తక్కువగా నమోదైన ఏడాదిగా 2023 సంవత్సరం రికార్డు సృష్టించింది. వివాహాల సంఖ్య కూడా 5.9శాతం తగ్గిపోయి 4,89,281మందే పెళ్ళిళ్లు చేసుకున్నారు. గత 90ఏళ్ళలో మొట్టమొదటిసారిగా 5లక్షల కన్నా తక్కువకు ఈ సంఖ్య పడిపోయింది. జననాల సంఖ్య తగ్గడానికి గల కారణాల్లో ఇది కూడా ఒకటి. పితృస్వామ్య సంప్రదాయం ఆధారంగా కుటుంబ విలువలు వున్న జపాన్ సమాజంలో వివాహేతర జననాలు చాలా అరుదనే చెప్పాలి.

వివాహం చేసుకోవడానికి, పిల్లల్ని కని కుటుంబాలను పెంచుకోవడానికి యువత వెనుకడుగు వేస్తోందని సర్వేలు తెలియచేస్తున్నాయి. అంతంత మాత్రంగానే ఉద్యోగావకాశాలు, వేగంగా పెరుగుతూ పోతున్న జీవన వ్యయం, తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయాల్సి వచ్చే కార్పొరేట్ సంస్కృతులు ఇవన్నీ కూడా కారణాలుగానే వున్నాయి.

ఇలా తగ్గుతూ వస్తున్న జననాల రేటు చాలా కీలకమైన దశలో వుందని చీఫ్ కేబినెట్ కార్యదర్శి యోషిమస హయాషి విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి వచ్చే ఆరేళ్లు వుంటే ఇక యువ జనాభా కూడా గణనీయంగా తగ్గడం ఆరంభమవుతుందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఇదే చివరి అవకాశమని, ఇక సమయం వృధా చేయడానికి లేదని అన్నారు.

జపాన్ ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభం ఇదేనని ప్రధాని ఫ్యుమియో కిషిదా ఆందోళన వ్యక్తం చేశారు. జననాల సంఖ్య పెంచేందుకు అన్ని రకాలుగా రాయితీలు ఇతరత్రా మద్దతును అందచేస్తూ పలు చర్యలను ప్రభుత్వం ప్రకటిస్తోంది. అయినా వాటివల్ల పెద్దగా ఉపయోగం వుండడం లేదని యువత వాటిపైనే దృష్టి పెట్టడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రజల చూపు ఓటీటీ వైపు

న్యూఢిల్లీ : కరోనా తర్వాత భారత్‌లో ఓటీటీ(ఓవర్ ది టాప్) ప్రభావం పెరిగిపోయింది. ఓటీటీకి అలవాటైన దేశంలోని ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య అధికంగానే ఉన్నది. భారత్‌లో 86 శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఓటీటీ ఆడియో, వీడియో సేవలను ఆస్వాదిస్తున్నారు. ఇది దేశంలో ఇంటర్నెట్‌కు అత్యధిక వినియోగ వేదికగా మారిందని ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్, మార్కెటింగ్ డేటా అండ్ అనలిటిక్స్ కంపెనీ కాంటార్ నివేదిక స్పష్టం చేసింది. లక్షద్వీప్ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 90,000 కుటుంబాల నుంచి వచ్చిన ఇన్‌పుట్‌ల ఆధారంగా తయారైన నివేదికను ప్రస్తుతం కొనసాగుతున్న ఇండియా డిజిటల్ సమ్మిట్ 2024లో విడుదల చేశారు. నివేదిక సమాచారం ప్రకారం.. స్మార్ట్ టీవీ, స్మార్ట్ స్పీకర్లు, ఫైర్‌స్టిక్‌లు, క్రోమ్‌కాస్ట్‌లు పెరగటం ద్వారా డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ సేవల పెరుగుదలకు బలం చేకూరింది. 2021 నుంచి 2023 వరకు 58 శాతం వృద్ధి చెందింది.

ఇయు వ్యవసాయ విధానాలపై

గర్జించిన పోలండ్ రైతులు



వార్సా : యురోపియన్ యూనియన్ అమలు చేస్తున్న వ్యవసాయ, పర్యావరణ విధానాలపై పోలండ్ రైతులు భగ్గుమన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు మంగళవారం పోలండ్ రాజధాని వార్సా వీధుల్లో కదం తొక్కారు. ఉక్రెయిన్ ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2050కల్లా వాతావరణ తటస్థతను సాధించే లక్ష్యంతో చేపట్టిన యురోపియన్ విధాన ప్యాకేజీని వారు తిరస్కరిస్తున్నారు. ఉదయం 11గంటలకల్లా ప్రదర్శన ప్రారంభం కావాల్సి వుండగా, అంతకుముందుగానే గుంపులు గుంపులుగా ఆందోళనకారులు రహదారులను దిగ్బంధించారని స్థానిక మీడియా తెలిపింది. దీంతో ట్రాఫిక్‌ను కూడా మళ్ళించారు. 'నేను రైతును, బానిసను కాను' అంటూ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. సెంట్రల్ వార్సాలో పలు వీధుల్లో ప్రదర్శన నిర్వహించిన తర్వాత రైతులు తమ డిమాండ్లను తెలియచేసేందుకు పార్లమెంట్ దిగువ సభకు, ప్రధాని డొనాల్డ్ టస్క్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్ళారు. అయితే ప్రధానితో సమావేశం కేవలం లాంఛనంగా సాగిందంటూ వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతు ప్రతినిధులు, అధికారులతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని కేవలం మౌఖికంగా హామీలివ్వడం తప్పితే ఎలాంటి చర్యలు లేవని రైతు నేత ఒకరు వ్యాఖ్యానించారు. వాస్తవికమైన, నిర్దిష్టమైన చర్యలను తాము భావించామని, కానీ ఏదీ జరగలేదన్నారు.



మీ కోసం

కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

జీవన సౌరభం

భయపడడం మానేస్తేనే జీవితం మొదలవుతుంది.

చీమలు - చిట్టెలుక



చిట్టి ఎలుక ఒక్కటి
గుంత తవ్వుకున్నది
లోపలికి, బయటకు
పరుగు పెట్టుచున్నది

ఆ దారిన పోయేటి
చీమల బారుని చూసి
తెలివి లేని చీమలారా
ఎందుకు ఆ యాతన?

ఎప్పుడు చూడు తిండికై
లేని పోని శోధన
అంటూ వెక్కిరించింది
తోకను చూపించింది!

నవ్వుకుంటూ చీమలన్ని
ముందుకేమో సాగెను
మోస్తున్న ఆహారంతో
పుట్టలోకి పోయెను!

అది శ్రావణ మాసము
మంచి వాన కాలము
బయట తిరుగ వీలులేని
జోరు వాన కురిసెను!

ఆహారం లేక ఎలుక
అలమటించ సాగెను
అటు నిటు తిరుగుచు
ఆకలితో ఏడ్చెను!

చీమలేమి చేయునో
అని
పుట్టలోకి చూసెను
కమ్మని వాసన గని
దాని నోరు వూరెను.

రావోయి ఎలుక బావ
లడ్డు తిందువు గాని
అంటూ ఆ చీమలన్ని
ఆప్యాయత చూపెను!

ఇంత జోరు వానలోన
అంత తీపి వంటలెలా?
అంటూ ఆ చిన్ని ఎలుక
ఆశ్చర్య పోయెను!

"ప్రతిరోజూ కష్ట పడుతూ
తెచ్చి దాచుకుందుము
బయటకి పోలేని రోజు
ఇంట నుండి తిందుము"

అంటూ తమ రహస్యాన్ని.
చీమలన్ని చెప్పగ
మంచి మాట చెప్పిరంటు
ఎలుక సంతసించెను!

వెక్కిరించినందుకు
క్షమించమని కోరెను.
మీ తెలివికి దాసోహం
అంటూ వంగి మొక్కెను!
– కూచిమంచి నాగేంద్ర,
91821 27880

- కూచిమంచి నాగేంద్ర ,
91821 27880.





తేడాలు కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





జడ్డు జ్యోతి శ్రీ,
5వ తరగతి,
శశి హై స్కూల్,
కలిదిండి మండలం,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇద్దరు అమ్మలు.. బోలెడు ప్రశ్నలు...

బిడ్డకు చిన్న దెబ్బ తగిలితేనే తల్లడిల్లిపోతుంది తల్లి హృదయం. బిడ్డ క్షణం కంటిముందు కనిపించకపోతే తెగ కంగారు పడిపోతుంది. మరి ఆ తల్లే గుండె రాయి చేసుకుని బిడ్డను అమ్మేస్తుందంటే కారణమేంటి? ఆకలి అన్నిటికంటే బలమైనది.

'నా కళ్లముందే బిడ్డలు ఆకలితో చనిపోతున్నారు. నేను వాళ్లకి కడుపునిండా అన్నం పెట్టలేకపోతున్నాను. పిల్లల ఆకలి తీర్చేందుకు వీధుల్లో యాచించాను. నా శరీరాన్నే వస్తువుగా చేసి అమ్ముకున్నాను. ఇలాంటి పరిస్థితుల్లో ఆ బిడ్డకు మంచి ఆహారం పెడతానని, విద్య నేర్పిస్తానని ఎవరైనా ముందుకు వస్తే ఎలా కాదనగలను? అందుకే కట్టలు తెచ్చుకుంటున్న దు:ఖాన్ని దిగమింగుకుని బిడ్డను అమ్మేశా' అని చెబుతున్న అమ్మలు ఈ దేశంలో ఎందరు?

35 ఏళ్ల చుమ్కీ మలాకర్‌ది పశ్చిమ బెంగాల్. ఆమెకు ఆరుగురు పిల్లలు. ఆ కుటుంబానికి ఆదాయం లేదు. ఆసరా లేదు. కనీసం తల దాచుకునేందుకు ఇల్లు కూడా లేదు.


చుమ్కీ కుటుంబం

'నా పిల్లల ఆకలి తీర్చేందుకు తిరగని వీధి లేదు. రోడ్డు మీద ఏది కనపడితే అది ఏరుకునేదాన్ని. వ్యర్థాలను ఉడకపెట్టైనా ఒక్కపూట భోజనం పెట్టాలని ఎంతలా తపించానో.. అయినా బిడ్డల ఆకలి తీరే దారి కనిపించేది కాదు. ఆరుగురు బిడ్డలతో ఎక్కని బస్సు లేదు. రైలు లేదు. ఎక్కడ బయలుదేరానో తెలియదు. ఇప్పుడు ఈ అడవికి చేరాను. ఇక్కడైతే నా బిడ్డలకు ఏదైనా కాయో, పండో దొరుకుతుందని ఆశపడ్డాను' అంటోంది చుమ్కీ మలాకర్.

అస్సోసోల్ ప్రాంతం నుండి చుమ్కీ బంకురా అటవీ ప్రాంతానికి చేరుకుంది. ఆకాశమే ఇంటి కప్పుగా ఆ కుటుంబం రోజుల తరబడి అడవిలో నివసిస్తోంది. 'ఒక్కోసారి మాకు వరుసగా రెండు రోజుల పాటు ఏ ఆహారమూ దొరకదు. ఆకలి బాధకు తోడు విపరీతమైన చలి. కప్పుకునేందుకు ఏ ఆచ్ఛాదన లేక కడుపులో కాళ్లు పెట్టుకుని నా బిడ్డలు నిద్రించేవారు. ఇట్లాంటి పరిస్థితుల్లోనే నా ఆఖరి బిడ్డను అమ్మగా వచ్చిన డబ్బులతో మిగిలిన బిడ్డలకు కొన్ని రోజులైనా తిండి పెట్టొచ్చని భావించాను' అంటోంది చుమ్కీ.

సిభాన్‌ది మరొక కథ

షిబాన్ సింగ్ (40). ఏడుగురు బిడ్డల తల్లి. ఆమె కుటుంబం ఫల్‌పహారీ ప్రాంతంలో కనకాబోటీ గ్రామ పంచాయతీలో ఓ గుడారంలో నివసిస్తోంది. ఆమె భర్త అమర్ దాస్, స్థిరాదాయం లేని భవన నిర్మాణ కార్మికుడు. కొన్ని రోజుల క్రితం షిబానీ తన ఏడవ బిడ్డకు జన్మనిచ్చింది. ముగ్గురు బిడ్డల తరువాత ఆమె కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం స్థానిక ఆస్పత్రిని సంప్రదించింది. అయితే ఏ విధమైన గుర్తింపుకార్డు లేనందున ఆమెకు ఆపరేషను చేయలేదు. రూ.5000 చెల్లిస్తే ఆపరేషన్ చేయిస్తామని మధ్యవర్తులు చెప్పారు.

'నా బిడ్డలకు రెండు పూటలా తిండి పెట్టలేని పరిస్థితి నాది. ఈ స్థితిలో అంత డబ్బు ఎక్కడ నుంచి తేగలను? మొన్న జనవరిలో ఆడబిడ్డ పుట్టింది. ఇప్పటికే నా ఆరుగురు బిడ్డలు తీవ్ర పోషకాహార లేమితో బాధపడుతున్నారు. ఏవిధమైన గుర్తింపు కార్డు లేక మాకు ఏ సంక్షేమ పథకాలూ అందడం లేదు. ఈ బిడ్డను పోషించలేక, కళ్లముందే చంపేసుకోవడం ఇష్టం లేక అమ్మేందుకు ప్రయత్నించాను' అని చెప్పింది షిబానీ.

పేదరికంలో మగ్గిపోతున్న ఈ అమ్మలిద్దరూ దేశంలో ఎందరో తల్లులకు ప్రతినిధులు. పొట్ట కూటి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణిస్తున్న అసంఖ్యాక వలస కార్మికుల కుటుంబాలకు ప్రతిబింబాలు. వారికి స్థిరమైన ఆదాయం ఉండదు. గుర్తింపు పత్రాలు అందవు. పిల్లలకు చదువు అబ్బదు. పోషణ ఉండదు. ఏదైనా అనారోగ్యం వస్తే చచ్చిపోవడమే వారి ముందున్న ఏకైక మార్గం. గాలికి, ధూళికి పెరుగుతారు. రోడ్డు చివర కాదు, ఊరి చివరో, శ్మశానం పక్కనో, చెట్టుమీదో, గట్టుమీదో సేద తీరుతారు. ఏదేని స్వచ్ఛంద సంస్థల చొరవతో వీరికి అందే స్వావలంబన తాత్కాలికం. శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాల్సిన పాలకులు వీరున్నారన్న సంగతి గుర్తించడానికి కూడా ఇష్టపడరు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తల్లులు ఏం చేయాలి?

బిడ్డలను అమ్ముకోవడం ఏమాత్రమూ పరిష్కారం కాదు. అది పూర్తిగా అమానవీయం. ఒక బిడ్డ హక్కును హరించటం కూడా. మరి ఒకపూట తిండి కూడా దొరకని బతుకులు వాళ్లవి. కుటుంబ నియంత్రణ మీద అవగాహన ఉండదు. ఉన్నప్పుడు కూడా ఏవొక అడ్డంకులు ఎదురవుతాయి. దేశం అభివృద్ధి చెందడం అంటే– ఇలాంటి అనామక జీవితాలకు కూడా తిండి గుడ్డా ఇల్లూ ఉపాధి సమకూరటం; బిడ్డలకు పోషకాహారం అందడం. ఆ దిశగా పాలకులు పట్టించుకోవాలి. చర్యలు చేపట్టాలి. అమ్మలు అస్సహాయులుగా నిలబడని స్థితిని సృష్టించాలి. అప్పుడు 'బిడ్డలను అమ్ముకున్న తల్లి' తరహా కఠినమైన వార్తలను మనం వినకుండా ఉండగలుగుతాం.


సిభాన్ కుటుంబం



మునగాకుతో బోలెడు లాభాలు

మునగచెట్టు కాడలతో పాటు ఆకు, పూతలో కూడా ఎన్నో పోషకాలు ఉన్నాయని చాలామందికి తెలుసు. వీటిని ఆహారంలో కలిపి తీసుకుంటే అనారోగ్యానికి గురికారు. రక్తహీనత, రుతుక్రమ సమస్యలు ఉన్నవారు మునగాకు తింటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

- ఎండకాలంలో వచ్చే లేత మునగ ఆకుల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుంది. దాంతో ఈ కాలంలో వచ్చే జలుబు, దగ్గులాంటివి దరి చేరవు. పుండ్లు, ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి.
- పాలకూరతో పోలిస్తే ఈ ఆకులో మూడు రెట్లు ఐరన్ లభిస్తుంది. అరటిపండు కంటే ఏడు రెట్లు మెగ్నీషియం లభిస్తుంది. ప్రోటీన్లు ఉంటాయి. దీన్ని తరచూ పప్పుగానూ లేదా ఫ్రై రూపంలో తీసుకుంటే శక్తినిస్తుంది.
- పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల కాస్త తినగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. దాంతో శరీరంలో కొవ్వు పదార్థాలు కరిగి అధిక బరువును తగ్గిస్తాయి.
- మునగలో ఉండే క్లోరోజనిక్ చెడు కొవ్వును కరిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది. శరీరంలో వ్యర్థాలను బయటకు పంపడంలో సాయపడుతుంది.
- మునగాకులో విటమిన్ ఎ చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. దీనిలో ఉండే అమైనో ఆమ్లాలు ప్రోటీన్ ఉత్పత్తికి తోడ్పడతాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరుస్తాయి.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచేలా ...



మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ నటించిన 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుందని సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ అన్నారు. మార్చి 28న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా గురించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. వరల్డ్ క్లాసిక్ మూవీ 'లారెన్స్ ఆఫ్ అరేబియా' మాదిరిగా ఈ సినిమా ఉంటుందని అన్నారు. మార్చి 10న ఆడియో విడుదల పెద్దఎత్తున చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కెఆర్ గోకుల్, అరబ్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలకపాత్రల్లో నటించారు. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా ఈ సినిమాను డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు.



నేడు శ్రీవిష్ణు సినిమాకు నామకరణం

హీరోగా శ్రీ విష్ణుతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త సినిమాకు శ్రీకారం చుట్టింది. నిర్మాత టిజి విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. దీనికి సంబంధించిన నామకరణం ఈవెంట్ పోస్టర్‌ను చిత్ర ప్రతినిధులు విడుదల చేశారు. గురువారం శ్రీవిష్ణు పుట్టినరోజును పురస్కరించుకుని సినిమా పేరు ప్రకటించబోతున్నారు.


త్వరలో తాప్సీ వివాహం



హీరోయిన్ తాప్సీ త్వరలోనే వివాహం చేసుకోబోతున్నట్లుగా సమాచారం. ఢిల్లీకి చెందిన తాప్సీ 'ఝుమ్మంది నాదం' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించారు. తర్వాత ఇక్కడే కొన్ని సినిమాల్లో నటించారు. అనంతరం బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ రాణించారు. డెన్మార్క్ బ్యాడ్మింటెన్ ప్లేయర్ మథియస్ బోతో, తాప్సీ ప్రేమించుకుంటున్నారు. గతేడాది ఈ విషయాన్ని ఆమె అధికారికంగా ప్రకటించారు. త్వరలోనే రెండు కుటుంబాల సమక్షంలో ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగబోతుందని సమాచారం.

2న వ్యూహం విడుదల

తాను తీసిన 'వ్యూహం' సినిమా మార్చి 2న విడుదల కానుందని దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలిపారు. తొలుత ఈనెల 25న విడుదల చేయాలని భావించామని, సాంకేతిక కారణాలతో మార్చి 1కి వాయిదా వేశామని తెలిపారు. అయితే ఇప్పుడు ఒకరోజు ఆలస్యంగా మార్చి 2వ తేదీన విడుదల చేస్తున్నామని చెప్పారు. 'పట్టు వదలని విక్రమార్కుడిని' అనే క్యాప్షన్‌తోపాటు సెన్సార్ సర్టిఫికెట్‌ను చేతిలో పట్టుకుని ఉన్న ఫొటోను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. వ్యూహం సినిమా విడుదలను నిలిపేయాలని కోరుతూ నారా లోకేష్ తెలంగాణా హైకోర్టును పిటిషన్ వేయటంతో ఇప్పటివరకూ వాయిదా పడుతూ వచ్చింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా శపథం కూడా రానుంది.



దాశరథికి యూత్ ఐకాన్ అవార్డు



క్యారెక్టర్ ఆర్టిస్ట్ దాశరథి నరసింహన్‌కు అమైది తమిళ్ వర్సిటీ యూత్ ఐకాన్ అవార్డు లభించింది. నౌకాదళంలో పనిచేసిన ఆయన సినిమాలపై ఉన్న ఆసక్తితో 2016లో చిత్రరంగ ప్రవేశం చేశారు. వెంకటేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన 'చెన్నై 600028-2' చిత్రంలో నటించారు. బ్యాడ్‌బాయ్స్ బృందంలో ఒకరిగా నటించారు. తర్వాత 'కణ', 'ఆర్కే నగర్', '100' చిత్రాల్లో కీలకపాత్రలు పోషించారు. రజనీకాంత్ అతిథి పాత్రలో పాత్రలో నటించిన 'లాల్ సలామ్' చిత్రంలో విష్ణు విశాల్‌కు మిత్రుడిగా నటించారు. ప్రస్తుతం అజిత్ హీరోగా నటిస్తున్న 'విడాముయర్చి' చిత్రంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఎన్.శంకర్ పర్యవేక్షణలో మూడు వెబ్ సిరీస్



గతంలో అభ్యుదయ సినిమాలు తీసిన దర్శకుడు ఎన్.శంకర్ తాజాగా నిర్మాత, దర్శకత్వ పర్యవేక్షణలో మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు తీయబోతున్నారు. ఎన్‌కౌంటర్, శ్రీరాములయ్య, జయం మనదేరా, ఆయుధం, భద్రాచలం, జై బోలో తెలంగాణా వంటి సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. తాజాగా ఎన్.శంకర్ టీవీ అండ్ ఫిల్మ్ స్టూడియో బ్యానర్ స్థాపించారు. తానే నిర్మాతగా, దర్శకత్వం వహిస్తూ 'తెలంగాణా పోరు', మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తి, ఆదర్శప్రాయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్' వంటి పేర్లతో వెబ్ సిరీస్ తీయబోతున్నట్లుగా శంకర్ ప్రకటించారు.

ఇషాన్, శ్రేయస్‌పై బిసిసిఐ కొరడా

- వార్షిక కాంట్రాక్ట్‌ల పొడిగింపునకు 'నో'
- యువ క్రికెటర్లకు పెద్దపీట



ముంబయి: భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపై కొరడా ఝుళిపించింది. 2023-24 సీజన్‌కు సీనియర్ క్రికెటర్ల వార్షిక ఒప్పందాలను బిసిసిఐ బుధవారం ప్రకటించగా.. అందులో వీరిద్దరికీ చోటు దక్కలేదు. దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా పాల్గొనాలని బిసిసిఐ తేల్చిచెప్పినా.. వీరిద్దరూ వేర్వేరు కారణాలను సాకుగా చూపుతూ ఉండడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో ఈసారి ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌ను కాంట్రాక్టుల నుంచి తొలగించింది. దక్షిణాఫ్రికా పర్యటన నుంచి మధ్యలోనే వచ్చేసిన కిషన్ తరువాత జరిగిన ఏ సిరీస్‌లోనూ పాల్గొలేదు. ఐపిఎల్ కోసం హార్దిక్ పాండ్యాతో కలసి ప్రాక్టీస్ చేశాడని వార్తలొచ్చాయి. రంజీ ట్రోఫీలో జార్ఖండ్ జట్టు ఆడాలని బిసిసిఐ చెప్పినా ఆడలేదు. ముంబయి తరపున అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో, బరోడాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆడాలని శ్రేయస్ అయ్యర్‌ను కోరినా అతడూ దూరంగా ఉన్నాడు. దీంతో అతనిపైనా వేటు పడింది. రోహిత్, కోహ్లీ, బుమ్రా, జడేజా గ్రేడ్-ఎ+లో ఉండగా.. గ్రేడ్-ఎకు రాహుల్, గిల్, సిరాజ్ పదోన్నతి పొందారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఏడాదిగా జట్టుకు దూరమైన రిషబ్ పంత్ గ్రేడ్‌లో ఉన్నాడు. టి20 స్పెషలిస్ట్ బ్యాటర్ రింకూసింగ్, తిలక్‌వర్మ కొత్తగా గ్రేడ్-సిలో చోటు దక్కించుకున్నారు. నిర్దేశించిన వ్యవధిలో కనీసం మూడు టెస్టులు కాని, 8 వన్డేలు లేదా 10 టి20లు ఆడితే వారిని కూడా గ్రేడ్‌లో చేరుస్తారు. ఇప్పటికే రెండు టెస్టులు ఆడిన ధృవ్ జురెల్, సర్ఫరాజ్ ఇంగ్లండ్‌తో జరిగే ఐదో టెస్ట్‌లోనూ ఆడితో వారి కెరీర్‌లో ఇది మూడో టెస్టు కానుంది. దీంతో వారు కూడా గ్రేడ్ జాబితాలో చేరే ఛాన్స్ ఉంది. అలాగే సెలెక్షన్ కమిటీ బౌలింగ్ కాంట్రాక్టులకు ఆకాశ్ దీప్, విజయ్‌కుమార్ వ్యాషక్, ఉమ్రాన్ మాలిక్, యశ్ దయాల్, కావేరప్పను సిఫార్సు చేసింది. ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్టును బీసీసీఐ కొత్తగా సిఫార్సు చేసింది. దీనిలో ఆకాశ్‌దీప్, విజయ్‌కుమార్, ఉమ్రాన్ మాలిక్, యశ్ దయాల్, విద్వాంత్ కావేరప్ప ఉన్నారు. ఏడాదికి ఎ+ ఆటగాళ్లకు రూ.7కోట్లు, ఎ ఆటగాళ్లకు రూ.5కోట్లు, బి ఆటగాళ్లకు రూ.3కోట్లు, సి కేటగిరికి కోటి రూపాయలు చొప్పున్న ఒక్కో ఆటగానికి బిసిసిఐ చెల్లించనుంది.

2024-25కు వార్షిక కాంట్రాక్టు జాబితా..

గ్రేడ్-ఎ+ : రోహిత్, కోహ్లీ, బుమ్రా, జడేజా
గ్రేడ్-ఎ : అశ్విన్, షమీ, సిరాజ్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్, హార్దిక్.
గ్రేడ్-బి : సూర్యకుమార్, పంత్, కుల్దీప్, అక్షర్, జైస్వాల్.
గ్రేడ్-సి : రింకూ సింగ్, తిలక్ వర్మ, గైక్వాడ్, శార్దూల్, దూబే, బిష్ణోయ్, జితేష్, సుందర్, ముఖేష్ కుమార్, సంజు శాంసన్, అర్ష్‌దీప్, కెఎస్ భరత్, ప్రసిద్ధ్ కృష్ణ, అవేష్ ఖాన్, రజత్ పటీదార్.

ఫైనల్‌కు పుణేరి, హర్యానా

- సెమీస్‌లో పట్నా, జైపూర్ ఓటమి
- ప్రొ కబడ్డీ సీజన్-10


పుణేరి-పట్నా మ్యాచ్ దృశ్యం

హైదరాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-10 ఫైనల్లోకి పుణేరి పల్టన్స్, హర్యానా స్టీలర్స్ జట్లు దూసుకెళ్లాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో పుణేరి పల్టన్స్ 37-21 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌ను, రెండో సెమీస్‌లో హర్యానా స్టీలర్ 31-27పాయింట్లతో జైపూర్ పింక్ ప్యాంథర్స్‌ను చిత్తుచేశాయి. తొలి సెమీస్‌లో పుణేరి జట్టు 20-11పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. హోరాహోరీగా సాగిన రెండో సెమీస్‌లో 4పాయింట్ల తేడాతో హర్యానా నెగ్గింది. ఫైనల్ మార్చి 1(శుక్ర) జరగనుంది.

జైస్వాల్ @ 12

ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజాగా విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాల్గో టెస్ట్‌లో రాణించిన యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ మూడు స్థానాలను మెరుగుపర్చుకుని 12వ ర్యాంక్‌లో నిలిచాడు. నాల్గో టెస్ట్‌లో జైస్వాల్ 73, 37 పరుగులతో రాణించాడు. ఇక శుభ్‌మన్ గిల్ (38, 52 నాటౌట్), ధృవ్ జురెల్ (90, 39 నాటౌట్) ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ స్థానానికి చేరుకున్నాడు. గిల్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని 31వ స్థానానికి.. జురెల్ 31 స్థానాలు మెరుగుపర్చుకుని 69 స్థానానికి ఎగబాకారు. ఇదే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీతో కదంతొక్కిన ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరుకోగా.. న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. భారత్ నుంచి టాప్-10లో విరాట్ కోహ్లి ఒక్కడే చోటు దక్కించుకున్నాడు.



ప్రి క్వార్టర్స్‌కు బొప్పన్న జోడీ

దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

దుబాయ్: దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో బొప్పన్న-ఎబ్డెన్, యుకీ బాంబ్రీ-హాస్ జంటలు శుభారంభం చేశాయి. మంగళవారం రాత్రి జరిగిన తొలిరౌండ్ పోటీలో బొప్పన్న-ఎబ్డెన్ జంట 7-6(7-4), 7-6(7-5)తో మన్సోరి(ట్యునీషియా)-ఖురేషీ(పాకిస్తాన్) జంటను చిత్తుచేశారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 41నిమిషాలసేపు సాగింది. మరో మ్యాచ్‌లో యుకీ బాంబ్రీ-రాబిన్ హాస్ జంట 6-7(8-6), 6-3, 10-8తో బబ్లిక్(కజకిస్తాన్)-మన్నారినో(ఫ్రాన్స్) జంటను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరారు. ఇక భారత సింగిల్స్ స్టార్ ప్లేయర్ సుమిత్ నాగల్ రౌండ్-32లో పరాజయాన్ని చవిచూశాడు. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో సుమిత్ 4-6, 7-5, 1-6తో ఇటలీకి చెందిన లొరెంజో సొనేగో చేతిలో ఓడాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68